


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 128 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 20 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 128 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 20 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- ఉగాది వేళ రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి
- ఈ నెల 22న రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటన
- రూ.2 లక్షల వరకు రుణమాఫీతో రైతులకు ఊరట కల్పించామన్న సీఎం
- ధరణి సమస్యల పరిష్కారానికి భూ భారతిని తీసుకొచ్చామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద రూ.18,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రుణభారంతో ఉన్న రైతులకు పెద్ద ఊరటనిస్తూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దేశంలోనే అత్యంత తక్కువ రుణభారం ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు.

- మిగతా2లో





## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను విప్‌లుగా నియమించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- అసెంబ్లీ విప్‌లుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, విజయరమణారావు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను రాష్ట్ర ప్రభు త్వం విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు.ఇక, అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా2లో

# హైదరాబాద్ బిర్యానీకే కాదు..

## దేశంలో తెలుగు సినిమాకు ప్రత్యేక గుర్తింపు

- వైభవంగా 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' కార్యక్రమం
- అంగరంగ వైభవంగా తెలంగాణ గద్దర్ సినిమా అవార్డుల వేడుక
- ఉత్తమ నటుడిగా నాగచైతన్య (తండేల్), నటిగా రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్) ఎంపిక
- మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ప్రదానం
- హైదరాబాద్ వేదికగా జరిగిన కార్యక్రమానికి హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ బిర్యానీకే కాదు.. దేశంలో తెలుగు సినిమాకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సౌత్ కొరియా తరహాలో మా ప్రభుత్వం సినిమా రంగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఇండియన్ సినిమా హైదరాబాద్ కేంద్రంగా పని చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం (మార్చి 19) హైటెక్స్?లో ఎఫ్డీసీ ఆధ్వర్యంలో గద్దర్ అవార్డ్స్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్?గా హాజరై విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ ప్రజా యుద్ధ నౌక అని.. ఆయన పిలుపుతో లక్షలాది మంది కదిలేవారని అన్నారు.
గద్దర్ తన గళంతో అనేక ఉద్యమాలకు ఊపిరిపోశా రన్నారు. గద్దర్ పేరు మీదుగా అవార్డ్స్ ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. సినీ పరిశ్రమకు గుర్తింపునివ్వాలని భావించామన్నారు. చెన్నై నుంచి సినీ పరిశ్రమను హైదరాబాద్ తరలించేందుకు ఏఎన్ఆర్, ఎన్టీఆర్ వంటి ప్రముఖులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. సినీ పరిశ్రమకు దాసరి నారా యణ రావు పెద్దగా వ్యవహరించారని పేర్కొన్నారు. సినీకార్మిక పక్షపాతిగా నటుడు ప్రభాకర్ గొప్ప పనులు చేశారని కొనియాడారు. సినీ పరిశ్రమ హైదరాబాద్ లోనే వేళ్లూనుకునేందుకు రామోజీరావు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గద్దర్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక అట్టహాసంగా జరిగింది. ఎఫ్డీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి హాజరై విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ వేడుకకు సినీ ప్రముఖులు, నటులు పెద్ద



ఎత్తున తరలివచ్చారు.మెగాస్టార్ చిరంజీవి దంపతులు, విశ్వ నటుడు కమల్ హాసన్, అక్కినేని నాగార్జున దంపతులు, రాం చరణ్, ఖుష్బూ, అక్కినేని నాగచైతన్య దంపతులు, అల్లు అరవింద్ తదితరులు ఈ వేడుకలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో

- మిగతా2లో



## వందేమాతరం పాడాల్సిందే.. ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్

- వందేమాతరం పాడని ఎంఐఎం ఎమ్మెల్యేల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం
- అధికారంలోకి వస్తే వందేమాతరం గీతాన్ని తప్పనిసరి చేస్తామని హెచ్చరిక
- కేరళ ఎన్నికల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని ఆరోపణ
- పెండింగ్ రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:**అసెంబ్లీలో వందేమాతరం ఆలపించే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా జాతీయ గీతాన్ని గౌరవించి, వందేమాతరం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే వందేమాతరం గానాన్ని తప్పనిసరి చేస్తుందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐఎం నేతల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.

- మిగతా2లో




## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- ఇంధన అవసరాల తీరేలా సంబంధిత దేశాలతో మాట్లాడుతున్నట్లు వెల్లడి
- పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న రణధీర్ జైశ్వాల్
- కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారన్న జైశ్వాల్

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు

- మిగతా2లో

# యుద్ధాన్ని ముగిస్తాం..

## ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే అంశంపై స్పందించేందుకు నిరాకరణ
- అమెరికా ప్రణాళిక ప్రకారమే వెళు తోందన్న రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్
- ఏ లక్ష్యాలతో యుద్ధం ప్రారంభించామో వాటిని సాధించి మిషన్ పూర్తి చేస్తామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. అయితే ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే విషయం చెప్పలేమని అన్నారు. యుద్ధం ముగింపుపై కచ్చితమైన కాలపరిమితిని చెప్పేందుకు ఆయన

- మిగతా2లో



## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!



- ప్రముఖ జ్యోతిష్యుడు 'కెప్టెన్' అశోక్ ఖారట్ అరెస్ట్
- జ్యోతిష్యం పేరుతో మహిళలకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి
- పెన్‌డ్రైవ్‌లో 58 మంది మహిళల అత్యాచార వీడియోలు స్వాధీనం
- కేసు దర్యాప్తునకు ఐపీఎస్ అధికారిణి నేతృత్వంలో సిట్ ఏర్పాటు
- రాజకీయ, సినీ ప్రముఖులతో ఖారట్‌కు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ కీచక జ్యోతిష్యుడి గుట్టురట్టయింది. జ్యోతిష్యం, వాస్తు పేరుతో మహిళలను లోబర్చుకుని, లైంగికంగా దోపిడీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్యుడు, రిటైర్డ్ మర్చంట్ నేవీ అధికారి అశోక్ ఖారట్ (67) అలియాస్ 'కెప్టెన్'ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతని కార్యాలయంలో 58 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్

- మిగతా2లో

# త్వరగా నిర్ణయం తీసుకోవాలి

## కవిత పార్టీపై ఈసీకి ఢిల్లీ హైకోర్టు కీలక సూచన



- త్వరగా నిర్ణయం తీసుకోవాలి: కవిత పార్టీపై ఈసీకి ఢిల్లీ హైకోర్టు కీలక సూచన
- పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కవితకు చిక్కులు
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత
- దరఖాస్తులో లోపాలు ఉన్నట్లు హైకోర్టుకు గతంలోనే తెలిపిన ఈసీ
- లోపాలను సరిచేసి మళ్లీ దరఖాస్తు చేసినట్లు కవిత వెల్లడి
- కవిత పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు సూచనకు ఈసీ అంగీకారం

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# ప్రతీకారంతో ఇరాన్

గల్ఫ్ ప్రాంతంలో చమురు, వాయువు కేంద్రాలపై ఇరాన్ గురువారం దాడులు పెంచింది. ఇప్పటికే కొనసాగుతున్న యుద్ధానికి ఇది మరింత తీవ్రత తీసుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ ఇరాన్ కీలక వాయువు క్షేత్రంపై దాడి చేసిన తర్వాత ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టింది. దీంతో ఇంధన ధరలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి గల్ఫ్ దేశాలు కూడా నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం ఉందన్న ఆందోళన పెరిగింది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు ఉండటం వల్ల ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ చమురు సరఫరా మరింత ఇబ్బందుల్లో పడింది.

**యూఏఈ తీరంలో...**

యూఏఈ తీరంలో ఓ నౌకకు మంటలు అంటుకున్నాయి. ఖతర్ సమీపంలో మరో నౌక దెబ్బతినింది. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా భద్రంగా లేవని స్పష్టమైంది. ఎర్ర సముద్రం వద్ద సౌదీ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 118 డాలర్ల వరకు చేరింది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా దాడులు మొదలైన తర్వాత ఇది 60 శాతానికి పైగా పెరిగింది. ఇంధన ధరల ప్రభావంతో జరగనున్న యూరోపియన్ యూనియన్ సమావేశానికి ముందే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పరిస్థితిని తీవ్రంగా అభివర్ణించారు. యుద్ధ విరమణ, చర్చలు అవసరమని కోరారు.

**గల్ఫ్ దేశాల్లో దాడులు...**

ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ ఇరాన్ చర్యలను ఖండించాయి. అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ అబౌల్ ఘైట్ దీనిని ప్రమాదకర ఉద్రిక్తతగా పేర్కొన్నారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్, తూర్పు ప్రాంతాల్లో ఆరు డ్రోన్లను అడ్డుకుంది. యన్‌బూ పోర్టులోని సామ్‌రెఫ్ రిఫైనరీపై దాడి జరిగినట్లు తెలిపింది. హోర్ముజ్ మార్గాన్ని తప్పించేందుకు సౌదీ ఇప్పటికే ఎర్ర సముద్రం వైపు చమురు తరలిస్తోంది. ఖతర్‌లోని రాస్ లాఫాన్ ఎల్ఎన్‌జీ కేంద్రంపై క్షిపణులు పడటంతో భారీ నష్టం వాటిల్లింది. అక్కడ మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పారు. ముందస్తు దాడుల వల్ల ఉత్పత్తి ఇప్పటికే ఆగిపోయింది. ఇది ప్రపంచానికి వాయువు సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**గ్యాస్ నిక్షేపాలపై దాడులతో...**

కువైట్‌లోని మీనా అల్-అహ్మదీ రిఫైనరీలో డ్రోన్ దాడితో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమీపంలోని మీనా అబ్దుల్లా కేంద్రంలో కూడా మంటలు చెలరేగాయి. అబుదాబిలోని హబ్‌షాన్ గ్యాస్ కేంద్రం, బాబ్ ఫీల్డ్ కార్యకలాపాలు నిలిపివేశారు. ఇరాన్ దాడులు ప్రమాదకరంగా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు దెబ్బతిన్నా ప్రాణనష్టం పెద్దగా లేదు. ప్రపంచంలో అతిపెద్ద వాయువు క్షేత్రంగా గుర్తింపు పొందిన సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇది ఇరాన్, ఖతర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు. ఇరాన్‌లో విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 80 శాతం సహజ వాయువుపైనే ఆధారపడుతోంది. దీంతో ఈ దాడి దేశ విద్యుత్ సరఫరాపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఈ దాడితో మరింత తీవ్రతరం...**

ఈ దాడితో యుద్ధం మరింత విస్తరించినట్లు పరిశోధనా సంస్థలు పేర్కొన్నాయి. ప్రజల జీవన పరిస్థితులను కష్టతరం చేయాలనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ లక్ష్యాలను ఎంచుకుంటోందని విశ్లేషించాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ దాడులు నియంత్రణ తప్పితే ప్రపంచానికే ముప్పు ఉంటుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్ ఖతర్ శక్తి కేంద్రాలపై దాడులు కొనసాగిస్తే అమెరికా కూడా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు.

**ప్రదర్శనల్లో అరెస్టయిన ముగ్గురికి ఉరి**

జనవరిలో జరిగిన నిరసనల సమయంలో అరెస్టైన ముగ్గురిని ఇరాన్ ఉరిశిక్ష అమలు చేసింది. కోమ్ నగరంలో ఇద్దరు పోలీసులను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఆందోళనలను అణచివేసే సమయంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణల్లో న్యాయం జరగడం లేదని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడో వారంలోకి ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం చేరింది. మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,300 మందికిపైగా మరణించారు. లెబనాన్‌లో హిజ్బుల్లా దాడుల కారణంగా 10 లక్షల మందికి పైగా ప్రజలు నివాసాలు విడిచారు. 900 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్‌లో ఇరాన్ క్షిపణి దాడుల్లో 15 మంది మృతిచెందారు. వెస్ట్ బ్యాంక్‌లో నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు.

# హైదరాబాద్ బిర్యానీకే కాదు..

# దేశంలో తెలుగు సినిమాకు ప్రత్యేక గుర్తింపు

- మొదటి పేజి తరువాయి

వనజ ఉదయ్ డాన్స్ గ్రూప్ తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా చేసిన డ్యాన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. అదే విధంగా ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్, రాక్ స్టార్ దేవి ప్రసాద్, ఫోక్ సింగర్ మంగ్లీ తమ గళంతో అలరించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19, గురువారం సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రత్యేక శోభను తెచ్చారు.

ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి తన అర్ధాంగి సురేఖతో కలిసి హాజరుకాగా, కింగ్ నాగార్జున అమలతో విచ్చేశారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, నూతన దంపతులు నాగచైతన్య-శోభిత ధూళిపాళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025లో విడుదలైన చిత్రాలకు గాను పలు విభాగాల్లో అవార్డులు అందించారు. "తండేల్" చిత్రానికి గాను నాగచైతన్య ఉత్తమ నటుడిగా, "ది గర్ల్ ఫ్రెండ్" చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి సాయిలు ఉత్తమ దర్శకుడిగా

ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు, అలనాటి నటి జయసుధకు ఏఎన్నార్ ఫిల్మ్ అవార్డు అందజేశారు. సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు వ్యాఖ్యానంతో సాగిన ఈ వేడుకలో నటి నిధి అగర్వాల్ డ్యాన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ డీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమం సినీ పరిశ్రమలో నూతనోత్సాహాన్ని నింపింది.

## రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన భూ యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దాని స్థానంలో 'భూ భారతి'ని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు.

ఈ ఉగాది పర్వదినం సందర్భంగా, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

## త్వరగా నిర్ణయం తీసుకోవాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ ప్రజా జాగృతి పేరిట రాజకీయ పార్టీని తెలుగు సంవత్సరాది ఉగాది రోజున ప్రకటించాలని కవిత భావించారు. అయితే ఈ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో కవిత తన కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఈసీ వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఈసీ నుంచి స్పందన రాకపోవడంతో ఆమె కొద్దిరోజుల క్రితం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పార్టీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఈసీ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

కవిత పిటిషన్‌పై ఈరోజు ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. 'తెలంగాణ ప్రజా జాగృతి'పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది.

కవిత దరఖాస్తులో లోపాలు ఉన్నాయని గతంలో కోర్టుకు ఎన్నికల కమిషన్ తెలిపింది. అయితే ఈ లోపాలను సరిచేసినట్లు కవిత తరపు న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు. సాంకేతిక తప్పులను సరిచేసి ఈసీకి మళ్లీ దరఖాస్తు చేశామని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కవిత పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందుకు ఈసీ అంగీకరించడంతో కోర్టు విచారణను ముగించింది.

## వందేమాతరం పాడాల్సిందే.. ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' వ్యాఖ్యల వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత రహస్యంగా మరో పార్టీతో సమావేశమైనందునే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని, ఈ బాధ్యతను రాహుల్ గాంధీ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి అప్పగించారని సంచలన ఆరోపణలు చేశారు.రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసాతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ, గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తామని, అయితే పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని చెబుతూ, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యాసంస్థల్లో ఉగ్రవాద మూలాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## యుద్ధాన్ని ముగిస్తాం.. ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- మొదటి పేజి తరువాయి

నిరాకరించారు. యుద్ధం విషయంలో అంతిమ నిర్ణయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌దే అన్నారు. యుద్ధం ముగింపునకు తాము కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించుకోలేదని తెలిపారు.సౌదీ అరేబియాలోని అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇరాన్ దాడికి పాల్పడడంతో ఆగ్రహించిన అమెరికా తీవ్ర పరిణమాలు తప్పవని హెచ్చరించింది. ఇరాన్‌పై ఈ రోజు భారీ స్థయిలో దాడులకు పాల్పడుతామని, గల్ఫ్ యుద్ధాన్ని తమదైన స్టయిల్లో ముగిస్తామని పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. చనిపోయిన వారిని గౌరవిస్తామని, అనుకున్న పనిని పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యుద్ధాన్ని ముగిస్తామని అభిప్రాయపడ్డారు.ఇరాన్‌పై యుద్ధానికి దిగిన మొదటి రోజు నుంచి తమ లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన వెల్లడించారు. ఇరాన్ రక్షణ, క్షిపణి తయారీ కేంద్రాలను నాశనం చేశామని, కాబట్టి ఆ దేశం కొత్తగా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసుకోలేదని అన్నారు. అంతేకాదు ఇరాన్‌కు చెందిన 11 జలాంతర్గాములను ముంచివేసినట్లు తెలిపారు. ఏయే లక్ష్యాలతో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభించామో అవన్నీ సాధించి, తాము అనుకున్న మిషన్‌ను పూర్తి చేస్తామని పీట్ హెగ్సెత్ అన్నారు.

## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!

- మొదటి పేజి తరువాయి

లభించడం కేసు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు దర్యాప్తు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. వివరాల్లోకి వెళితే, నాసిక్‌లోని కెనడా కార్నర్ ప్రాంతంలో అశోక్ ఖారట్ 'ఓకస్ ప్రాపర్టీ డీలర్స్ అండ్ డెవలపర్స్' పేరుతో కార్యాలయం నడిపేవాడు. తనను తాను 'కెప్టెన్' అని, ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకునేవాడు. వివాహ సమస్యలతో బాధపడుతున్న 35 ఏళ్ల మహిళ ఒకరు 2022లో ఇతడిని సంప్రదించింది. ఆమె భర్తకు ప్రాణగండం ఉందని, ప్రత్యేక పూజలతో దానిని నివారిస్తానని నమ్మబలికాడు. అనంతరం ఆమెకు మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి, హిప్నటైజ్ చేసి, భయపెట్టి 2025 డిసెంబర్ వరకు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నాసిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, కారట్ ఫార్మ్‌హౌస్‌పై దాడి చేసి చాకచక్యంగా అతడిని అరెస్టు చేశారు. ఈ సోదాల్లో ఒక పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతని కార్యాలయంలో రహస్యంగా అమర్చిన సీసీటీవీ కెమెరాలను గుర్తించారు. అక్కడ లభించిన ఒక పెన్‌డ్రైవ్‌లో 58 మంది వేర్వేరు మహిళలపై లైంగిక దాడి చేస్తున్న వీడియోలు ఉండటంతో పోలీసులు నిర్ఘాంతపోయారు. మత్తుమందులు, చేతబడి వంటివి ప్రయోగించి మహిళలను లొంగదీసుకుని, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులతో

ఖారట్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకణ్‌కర్‌పై కూడా విమర్శలు రావడంతో ఈ కేసు రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారిణి తేజస్వినీ సత్పుతే నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు వీడియోలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపి, ఇతర బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 64 (రేప్), బ్లాక్ మ్యాజిక్ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, అతడిని కోర్టులో హాజరుపరచగా మార్చి 24 వరకు కస్టడీకి అప్పగించారు. సిట్ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- మొదటి పేజి తరువాయి

విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు.

## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- మొదటి పేజి తరువాయి

తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మనదేశానికి చేరుకున్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

## 99 రోజుల తర్వాత జైలు నుంచి పిన్నెల్లి విడుదల.. ఎవరినీ వదిపెట్టబోమని హెచ్చరిక!



పల్నాడు రాజకీయాల్లో కీలక నేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకుల జంట హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, నేడు ఆయన నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా జైలు వెలుపల వైసీపీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైలు నుంచి విడుదలైన అనంతరం పిన్నెల్లి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నమోదైన కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన మండిపడ్డారు. "వెల్దుర్తి మండలంలో జరిగిన టీడీపీ వర్గాల అంతర్గత గొడవలకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆధిపత్య పోరులో జరిగిన హత్యల ఘటనలో నన్ను ఉద్దేశపూర్వకంగా నిందితుడిగా ఇరికించారు" అని ఆయన స్పష్టం చేశారు. నాడు జిల్లా ఎస్పీ సైతం ఈ ఘటనను ఇరువర్గాల మధ్య జరిగిన పోరుగా తేల్చినప్పటికీ, ప్రభుత్వం తనను అన్యాయంగా 99 రోజులు జైల్లో పెట్టి మానసిక క్షోభకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "భవిష్యత్తులో మాకు తప్పకుండా ఒక రోజు వస్తుంది. ఆరోజు దీని వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు లాగుతాం. రాజకీయ నాయకులైనా, అధికారులైనా సరే... చట్టం ముందు నిలబెట్టి తీరుతాం. ఎవరినీ వదిలిపెట్టే సమస్యే లేదు" అని ఆయన హెచ్చరించారు. పిన్నెల్లి విడుదలతో మాచర్ల, వెల్దుర్తి ప్రాంతాల్లోని వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అయితే, ఇదే కేసులో ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి బెయిల్ నిరాకరించడంతో ఆయన ఇంకా జైలులోనే ఉన్నారు.

## హర్యానాలో ఆరేళ్లలో గుండెపోటుతో 17,973 మరణాలు

రాష్ట్రంలో 2020 జనవరి నుంచి 2026 జనవరి మధ్య కాలంలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గలవారు వేల సంఖ్యలో గుండెపోటుతో మరణించినట్లు అసెంబ్లీలో హర్యానా ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆరేళ్ల కాలంలో 17,973 మంది గుండెపోటు కారణంగా మరణించినట్లు అసెంబ్లీలో తెలిపింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత ఆరేళ్ల కాలంలో ఏ జిల్లాలో, ఎంతమంది, ఎంత వయస్సు కలిగిన వారు, హార్ట్ ఫెయిల్ కారణంగా మరణించారో తెలియజేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగారు. ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సిన్‌తో సంబంధం ఉందా, ఆ దిశగా ఏమైనా చర్యలు చేపట్టారా? అని ప్రశ్నించారు. అలాంటి సర్వేను నిర్వహించలేదని ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. జిల్లాల వారీగా, ఏ సంవత్సరంలో ఎంతమంది గుండెపోటుతో మరణించారో తెలిపింది. సంవత్సరాల వారీగా చూస్తే, 2020లో 2,394 మరణాలు సంభవించగా, 2021లో 3,188, 2022లో 2,796, 2023లో 2,886, 2024లో 3,063, 2025లో 3,255 మరణాలు జరిగినట్లు తెలిపింది. 2026 జనవరిలో 391 గుండెపోటు మరణాలు నమోదైనట్లు తెలిపింది.

## మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు దుబ్బాక సమీపంలో గండి

- చెల్లాపూర్ గ్రామ సమీపంలో కాలువకు గండి
- మల్లన్న సాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీరు వెళ్లే కాలువకు గండి
- గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించిన నీటి పారుదల శాఖ అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండిపడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో ఈ కాలువకు గండిపడింది. ఈ కాలువ మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీరు అందిస్తుంది. కాలువకు గండిపడటంతో నీరు వృథాగా చెల్లాపూర్ కందూరు చెరువులోకి వెళుతోంది. సాగర్‌కు గండి పడటంతో కాలువ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గండిపడిన ప్రాంతాన్ని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. అధికారులను కలిసిన రైతులు, కాలువకు త్వరగా మరమ్మతులు చేయాలని లేదంటే పంటలు ఎండిపోతాయని విజ్ఞప్తి చేశారు. కాలువను సాధ్యమైనంత తొందరగా బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. మల్లన్న సాగర్ నుంచి వచ్చే కెనాల్ కాలువ లైనింగ్ పనుల్లో క్వాలిటీ లేకపోవడం వల్ల కాల్వకు గండిపడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.






శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా పంచాంగం ఆవిష్కరణ..

# ఉగాది వేడుకల్లో...
# ఘనంగా పంచాంగ శ్రవణం సందేశం..!

- శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం..
- ఈ పంచాంగాన్ని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఆవిష్కరించారు..
- ముఖ్య అతిథిగా అడిషనల్ డిసిపి కె.ఎస్.రావు హాజరు..
- సంస్కృతి సాంప్రదాయాల ప్రాముఖ్యతపై ప్రసంగం..
- పంచాంగం జీవన మార్గదర్శి అని సంఘం అధ్యక్షుడు గోగులపాటి వ్యాఖ్యలు..
- పంచాంగ శ్రవణం.. గ్రహగతులు, వర్షపాతం, ఆర్థిక పరిస్థితులపై విశ్లేషణ..
- లలిత సహస్రనామం,భక్తి గీతాలు.. ఉగాది పచ్చడి, ప్రసాదాల పంపిణీ..

## సూరారం కాలనీలో ఘనంగా పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 19:** శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా సూరారం కాలనీ, జై శ్రీరామ్ నగర్ లూయిస్ బ్రెయిలీ భవన్లో గురువారం సాయంత్రం నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ అడిషనల్ డిసిపి కె.ఎస్.రావు హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు. పంచాంగం మన సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని, దీనిని ఆచరించడం ద్వారా జీవనశైలిలో మార్పులు, క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు.. యువత పూర్వీకుల సంప్రదాయాలను తెలుసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. సభాధ్యక్షుడిగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాంగ ప్రాముఖ్యతను వివరించారు.. పంచాంగం అనేది మన జీవిత రహదారిపై ఉన్న సూచికల వంటిది.. ఎటు వెళ్లాలి, ఎప్పుడెప్పుడు జాగ్రత్తగా ఉండాలి, ఏ సమయంలో ముందుకు సాగాలి అన్న దానికి ఇది మార్గదర్శిగా సూచిస్తుందని అన్నారు..



ఈ సందర్భంగా శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం మహిళా విభాగం ఆలపించిన లలిత సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, భక్తి గీతాలు అందరిని అలరింపజేశాయి.. అనంతరం ఉగాది పచ్చడి, బక్ష్యాలు, తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, సూరారం ఎస్సైలు మురళి గౌడ్, కృష్ణయ్య, కిషన్ నాయక్, సభ్యులు గడ్డం రుచిత రాంబాబు, సుబ్బలక్ష్మి సంజీవరావు, గీతా శ్రీధరాచార్యులు, హరి రాఘవేంద్ర, శంకరశర్మ, కోడూరి రామసీత జగదీశ్వర్, హైమ శివభాస్కర్, మాలతి శ్రీనివాస్, రమేష్ కులకర్ణి, గడ్డం గోవర్ధన్, రేఖజ్యోతి, లక్ష్మీ కుమారి, రత్నమాల, నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్, మల్లీశ్వరరావు స్థానిక ప్రజలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా పంచాంగ ఆవిష్కరణ..

తిథి వల్ల శ్రేయస్సు, వారంతో ఆయుష్షు, నక్షత్రంతో పాప విమోచనం, యోగంతో రోగ నివారణ, కరణంతో కార్యసిద్ధి లభిస్తాయి. ఈ ఐదు అంశాలను గ్రహించి ఆచరించినవారికి శుభం, క్షేమం, సౌఖ్యం, విజయాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. ఈ పరాభవ నామ సంవత్సరం పంచాంగాన్ని అవదూత దత్త పీఠాధిపతి బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా ఆవిష్కరించుకున్నట్టు తెలిపారు.. ఈ సందర్భంగా మణిద్వీప ఆశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పరిపూర్ణానంద యాజ్ఞవల్క స్వామీజీ పంచాంగ శ్రవణం చేసారు.. ఈ సంవత్సరానికి సంబంధించిన గ్రహగతులు, వర్షపాతం పరిస్థితులు, వ్యవసాయ ఫలితాలు, ఆర్థిక పరిస్థితులు మరియు సామాజిక మార్పులను వివరించారు.. ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు ఉన్నప్పటికీ, శ్రమ, ధైర్యం, సమయపాలనతో ప్రజలు అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు..

## కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే

భాజపా రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం

పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నా పోరాటం ముగ్గురిపైనే

- జాగృతి కార్యాలయంలో కవిత ఉగాది వేడుకలు
- డాడీ, మోడీ, చిన్న మోడీ (కేటీఆర్)ల పైనే తన పోరాటం అని వెల్లడి
- మంచి ముహూర్తం చూసుకుని పార్టీ ప్రారంభిస్తానన్న కవిత



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు. తన రాజకీయ ప్రయాణం స్వతంత్రంగా ఉంటుందని, ఎవరికీ అడ్వాంటేజ్‌గా మారబోనని ఆమె స్పష్టం చేశారు. "మంచి ముహూర్తం చూసుకుని పార్టీని ప్రారంభిస్తా.. అప్పుడే నా లక్ష్యాలను ప్రజల ముందు ఉంచుతాను" అని ఆమె అన్నారు. మరోవైపు, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు సానుకూల తీర్పునిచ్చింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' (ప్రాజీ) పేరుతో దాఖలైన దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ అధికారిక ప్రకటనకు ఉన్న సాంకేతిక అడ్డంకులు దాదాపు తొలగిపోయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'శ్రీ పరాభవ నామ సంవత్సరం'పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

- పరాభవం అనేది మన దేశానికి కాదన్న కిషన్ రెడ్డి
- భారత్ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు పరాభవం ఎదురవుతుందని వ్యాఖ్య
- పుణ్యభూమి భారతావనికి అన్ని శుభ ఫలితాలే వస్తాయని విశ్వాసం




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి

-4 లో

## కొత్తగూడెం జిల్లాలో రూ.52 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- జూలురుపాడు మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా గంజాయి పట్టివేత
- రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో మరో ముగ్గురు



-4 లో

# కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే

**హైదరాబాద్ పెన్ పవర్:**: దేశానికి కొత్త తెలుగు సంవత్సరంలో పరాభవం ఉండదని, అది శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మోదీ నాయకత్వంలో అన్ని సమస్యలను ఎదుర్కొనే సత్తా మన దేశానికి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం తర్వాత ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..'పరాభవ నామ సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని, విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. ఈ సంవత్సరం భారత్‌కు శుభఫలితాలే ఉంటాయని పండితులు పంచాంగం ద్వారా చెప్పారు. మంచి వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైనా ప్రధాని మోదీ నాయకత్వంలో వాటిని అధిగమించే శక్తి మనకు ఉంది. ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాలు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాయి. భారతదేశం మాత్రం సమర్థమైన నాయకత్వంతో, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. రామచందర్‌రావు మాట్లాడుతూ.. 'ప్రపంచం సాంకేతిక రంగంలో వేగంగా దూసుకుపోతోంది. ముఖ్యంగా ప్రతిఒక్కరూ ఏఐపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో జీ20



దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగాయి. భారత్‌లో మాత్రం మోదీ దౌత్య నీతి వల్ల ఇంధన ధరలు స్థిరంగా ఉన్నాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల విషయంలో కొద్దిపాటి కొరత ఉన్నా త్వరలోనే పూర్తిగా పరిష్కారమవుతుంది' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమరయ్య, పార్టీ సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్ తివారి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం జిల్లాలో రూ.52 లక్షల విలువైన గంజాయి పట్టివేత

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ పోలీసులు రూ.52 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండల కేంద్రంలో పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన పలువురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుమారు 105.54 కిలోల గంజాయిని కార్లలో గుర్తించారు.వాహనంలో గంజాయి తరలిస్తున్నరనే పక్కా సమాచారంతో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో రెండు కార్లలో గంజాయి పట్టుబడింది. టీఎస్11 ఈఆర్ 6312, టీఎస్07 జేవై 3959 అనే నెంబర్లతో కూడిన రెండు కార్లను పోలీసులు ఆపారు. ఆ కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఈ గంజాయిని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలించి విక్రయించాలని ప్రయత్నించినట్లు తెలిపారు.అరెస్టైన ముగ్గురిని నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంకు చెందిన అందేకర్ శ్రీనివాస్ (40)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభి, లక్ష్మణ్, ఫరూక్ అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

# 'శ్రీ పరాభవ నామ సంవత్సరం'పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

-3 పేజి తరువాయి

అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు.ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపి-వగరు-చేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.

# తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి చేరింది: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు చలన చిత్ర పరిశ్రమ నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, హాలీవుడ్ స్థాయికి ఎదిగిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా నిలిచిపోయిన సినీ అవార్డులను తిరిగి పునరుద్ధరించినందుకు సీఎం రేవంత్ రెడ్డి (జవీ =వఝుత్ష్ట =వసంఎ)కి భట్టి విక్రమార్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులను గౌరవించుకోవడం ప్రభుత్వ బాధ్యతని ఆయన పేర్కొన్నారు.

'సత్య హరిశ్చంద్ర' వంటి పౌరాణిక చిత్రాల నుంచి నేటి ఆధునిక చిత్రాల వరకు తెలుగు ఇండస్ట్రీలో ఎన్నో సందేశాత్మక చిత్రాలు వచ్చాయని భట్టి విక్రమార్క అన్నారు. గుర్తు చేశారు. ఇవి కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, సమాజంలో గొప్ప మార్పులకు నాంది పలికాయని కొనియాడారు. అవార్డుల ఎంపికలో ఎక్కడా రాజీ పడకుండా, అత్యంత పారదర్శకంగా విజేతలను నిష్పక్షపాతంగా ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో ఈ అవార్డులను నిర్వహించడం గర్వకారణమని, సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ వ్యక్తి కాదు వ్యవస్థ.. తెలంగాణ ఆటని, పాటని, ఆత్మని ప్రపంచానికి తెలియజెప్పిన గొప్ప కళాకారడని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సినీ ప్రముఖులకు, కళాకారులకు మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మెగాస్టార్ చిరంజీవి సంచలన ప్రకటన.. త్వరలో ఉచిత విద్యా ప్రాజెక్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** మెగాస్టార్ చిరంజీవి రీల్ హీరోనే కాదు రియల్ హీరో అనిపించుకుంటున్నారు. దశాబ్దాల కాలంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా లక్షలాది మందికి ప్రాణదాతగా నిలిచిన ఆయన, ఇప్పుడు సమాజంలోని మరో కీలక సమస్య అయిన పేదరికంపై పోరాడేందుకు అక్షరాయుధాన్ని ఎంచుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించిన 'ఉచిత విద్యా ప్రాజెక్ట్' రెండు తెలుగు రాష్ట్రాల్లోని సామాన్య ప్రజల్లో, విద్యార్థుల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది. ఒకప్పుడు రక్తదానం గురించి అవగాహన లేని రోజుల్లోనే ఆ ఉద్యమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లిన చిరంజీవి, ఇప్పుడు విద్య ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని బలంగా విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి గురువారం ఓ ఛానెల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో త్వరలోనే ఉచిత విద్యా ప్రాజెక్టును పట్టాలెక్కిస్తానని ప్రకటించారు.

**"అగరం" స్ఫూర్తితో.. ఉచిత విద్యా ప్రాజెక్ట్**

అంతేకాదు ఈ విద్యా ప్రాజెక్ట్ వెనుక ఉన్న ప్రేరణ గురించి చిరంజీవి



ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తాను ప్రారంభించిన రక్తదానోద్యమాన్ని చూసి స్ఫూర్తి పొందిన తమిళ నటుడు సూర్య, తన తండ్రి శివకుమార్ పేరుతో 'అగరం ఫౌండేషన్'ను స్థాపించి వందలాది మంది పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివిస్తున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అదే సూర్య చేస్తున్న విద్యాదానాన్ని చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానని, మంచి ఎక్కడ ఉన్నా దానిని స్వీకరించి ముందుకు సాగడమే తన లక్ష్యమని చిరంజీవి ప్రకటించడం విశేషం. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం ద్వారా వారి కుటుంబాల భవిష్యత్తును మార్చవచ్చని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, వారిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టడమే మెగాస్టార్ ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ "ఉచిత విద్యా ప్రాజెక్ట్" ప్రకటనతో అటు సినీ పరిశ్రమలోనూ, ఇటు రాజకీయ, సామాజిక వర్గాల్లోనూ చిరంజీవిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. గతంలో ఆక్సిజన్ బ్యాంకుల ద్వారా కరోనా కష్టకాలంలో వేలాది ప్రాణాలను కాపాడిన ఆయన, ఇప్పుడు విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టడం ద్వారా తన సేవా ప్రస్థానంలో మరో మైలురాయిని అధిగమించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

## తెలంగాణ ప్రజలకు బిగ్ అలర్ట్.. నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కి.మీలతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం జిల్లా వైరాలో 4 సెం.మీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్‌లో 4 సెం.మీ, జోగులాంబ గద్వాల జిల్లా ఐజలో 2 సెం.మీ, ఖమ్మం జిల్లా మధిరలో 1 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర పెరగనున్నట్లు ఐఎండీ హెచ్చరించింది.

## మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు.. నిందితులను విచారిస్తున్న సిట్

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ కేసును తెలంగాణ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసు మూలాలను, అంతర్జాతీయ సంబంధాలను ఛేదించేందుకు ఇటీవలే రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఇవాళ కేసులో పట్టుబడిన ముగ్గురు ప్రధాన నిందితులు నమిత్ శర్మ ఆయన సోదరుడు రితీష్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు.




**డ్రగ్స్ మూలాలపై ఆరా..**

ఫామ్‌హౌస్‌లో పార్టీ కోసం డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు.. దీని వెనుక ఉన్న డ్రగ్ పెడ్లర్లు ఎవరు? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా బెంగళూరు లేదా గోవా నుంచి ఈ సరఫరా జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. నిందితుల ఫోన్ కాల్ డేటా, సోషల్ మీడియా చాటింగ్స్ ఆధారంగా నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

**పార్టీలో పాల్గొన్న వారెవరు..?**

మొయినాబాద్ ఫామ్‌హౌస్ పార్టీలో ఎవరెవరు పాల్గొన్నారు అనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్టీకి హాజరైన వారిలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తల పిల్లలు ఉన్నట్లు సమాచారం అందుతోంది. సిట్ అధికారులు ఫామ్‌హౌస్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని, లోతుగా పరిశీలిస్తున్నారు. విచారణ అనంతరం మరికొంత మందికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

## టీ కాంగ్రెస్ లో పదవుల పండగ.. 14 డీసీసీ కమిటీలను ప్రకటించిన టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పార్టీని సంస్థాగతంగా బలోపేతంపై దృష్టి సారించిన అధికార కాంగ్రెస్ పార్టీ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 33 జిల్లాలకు డీసీసీలను నియమించగా తాజాగా 14 డీసీసీ కమిటీలను ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డీసీసీ కమిటీలను ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శి పదవులతో పాటు పూర్తి స్థాయి కమిటీల నియామించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నిర్ణయం వెలువరించారు. నాగర్న కర్నూల్, పెద్దపల్లి, మెదక్, నిర్మల్, ఖమ్మం, కామారెడ్డి, మంచిర్యాల, ఆదిలాబాద్, వనపర్తి, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి కలిగి మొత్తం 14 జిల్లాల టీసీసీ కమిటీలను ప్రకటించారు.



## ఈ ఏడాది మీడియాకు పండగే పండగ.. ప్రభుత్వ ఉగాది వేడుకల్లో సంతోశ్ కుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది వార్తలు క్రియేట్ చేయాల్సిన అవసరం లేదని మీడియాకు పుష్కలంగా వార్తలు లభిస్తాయని ప్రముఖ పంచాంగ పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ అన్నారు.




రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో బాచంపల్లి సంతోష్‌కుమార్ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాదిలో వార్తల మీద వార్తలు ప్రతిరోజు సంచలనమే ఉండబోతుందని జోస్యం చెప్పారు. మైకులు దొరికాయి కదా అని చెప్పి ఎక్కువ మాట్లాడవద్దని మౌనం మంచిదని సూచించారు. తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేసే నాయకులకు అందరూ పట్టం కడుతారని చెప్పారు.

**వారికి పరాభవం తప్పదు:**

యూట్యూబుల్లో వ్యూస్ కోసమే, లైక్?ల కోసమో పిచ్చిపిచ్చి థంబ్ నెయిల్స్ పెడుతూ సనాతధర్మాన్ని ఇబ్బంది పెట్టేవారికి పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వంతో తెలుగు రాష్ట్రాలు పోరాటం చేసి నిధులు సాధించుకునే అవకాశం కనిపిస్తోందని తెలిపారు. ఈ ఏడాది పరిపాలన వ్యవహారాల్లో న్యాయస్థానాల జోక్యం అధికమవుతాయని తెలిపారు. ఈ సారి దేశారిష్టయోగాలు అధికంగా ఉన్నాయని ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

## మానవత్వం చాటుకున్న వికాస తరంగిణి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం.



**చర్ల మార్చి 19 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం వద్దిపేట గ్రామం లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉయ్యిక రాము ఇల్లు పూర్తిగా వంట సామాగ్రి బట్టలతో సహా దగ్ధమైంది. రాము కుటుంబానికి నిలువ నీడ లేకుండా అయింది. దాదాపు మూడు లక్షల వరకు నష్టం జరిగింది.ఆ కుటుంబానికి చూసి చలించి కొత్తగూడెం. చర్ల మండల వికాస తరంగిణి దాతలు సహకారంతో కుటుంబాన్ని ఆదుకుంది.పదివేల రూపాయల సామాగ్రిని వంట సామాగ్రి బట్టలు వంట పాత్రలు అందజేశారు. దాతలు దొడ్డి రామకృష్ణ, చిప్ప శ్రీనివాసరావు, గుంటూరు వినోద్, వాసాభారతి, ఈ కార్యక్రమంలో చర్ల వికాస తరంగిణి పురుషోత్తం, ఈర్ని పద్మావతి, రమణ మచ్చవీర్రాజు, దల్లి సత్యనారాయణరెడ్డి, గోరంట్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కమిటీలో ఐదుగురు కాంగ్రెస్ నేతలకు చోటు.







**కారేపల్లి మార్చి 19పెన్ పవర్:** జిల్లా కాంగ్రెస్ కమిటీ నందు సింగరేణి మండలానికి చెందిన ఐదుగురు నేతలకు ప్రాతినిధ్యం లభించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ మండల కోఆర్డినేటర్ గాంధీ తెలిపారు. కారేపల్లి లో గురువారం మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా పగడాల మంజుల జిల్లా ఉపాధ్యక్షులుగా కాప సుధాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బానోతు రామ్మూర్తి జిల్లా కార్యదర్శిగా సట్టు వీరభద్రం ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాటి నర్సయ్యలకు స్థానం లభించింది అన్నారు. సింగరేణి మండలం లో పార్టీ ఉన్నతికి నాయకులు పాటుపడాలని సూచించారు.

## పేదలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు బోడేపూడి రమేష్ బాబు.


- కామేపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు.





**కామేపల్లి మార్చి 19పెన్ పవర్:** జీవితాంతం పేదలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు దివంగత బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోడేపూడి రమేష్ బాబు అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కామేపల్లి మండలం పండితాపురం లో రమేష్ బాబు 10వ, వర్ధంతి సందర్భంగా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు సతీమణి అనురాధ, బీఆర్ఎస్ మండల నాయకులు తీర్దాల చిదంబర రావు, బోడేపూడి వీర ప్రతాప్, యలమద్ది అప్పారావు, అంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్, సామ మోహన్ రెడ్డి, కాట్రాల రాంబాబు, నునావత్ సూర్య, మాలోత్ కిషన్, బాదావత్ సాజీ, జాటోత్ జాయ్ లూసి, శతకోటి హనుమంతరావు, తూము బాబు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, బాణోత్ రవి, అజ్మీరా హరి నాయక్, పుచ్చకాయల ఉదయ్, ముత్యం రామకృష్ణ, ఆదూరి ప్రసాద్, ధరావత్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్రం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు.





**భద్రాచలం మార్చ్ 19 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయనకు దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా, అర్చక స్వాములు దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. ముందుగా బలిపీఠం వద్ద పూజలు నిర్వహించి, గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి పట్టు వస్త్రాలు అందించి స్వామివారి విశిష్టతను తెలిపి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగేంద్రబాబు, టౌన్ ఎస్ఐ రామకృష్ణ ప్రసాద్, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.

## రసాయనిక పదార్థాలతో తయారు చేసినకూల్ డ్రింక్స్ కిస్వస్తి చెబుతాం.



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ పరాబావ నామ సంవత్సర ఉగాది పండగ రోజున చింతపులుసు, బెల్లము, వేప పువ్వు, ఉప్పు, కారం, మామిడికాయ ముక్కలు, తీసుకునే పచ్చడి, పానకం వంటి సహజ పానీయాలు మన ఆరోగ్యానికి మంచివి. కానీ మనం కూల్‌డ్రింక్స్‌కు అలవాటు పడి అనారోగ్యానికి గురవుతున్నాం. ఈ నేపథ్యంలో పానకం, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, శర్బత్, రాగి మాల్ట్ వంటి సహజ పానీయాలను తాగమని, కూల్‌డ్రింక్స్‌ను మానేయమని జన విజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తున్నది. కూల్‌డ్రింక్స్ గురించి వాస్తవాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్ల టన్నుల రసాయనాలను కూల్‌డ్రింక్స్ రూపంలో ప్రజలు తాగుతున్నారు. ప్రతి లీటర్ కూల్‌డ్రింక్‌లో 0.0180 మి.గ్రా. క్రిమిసంహారక మందులు ఉన్నాయని మన దేశంలోని "సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సి ఎస్ ఈ)" తెలిపింది. అయితే అనుమతించిన పరిమితి 0.0005 మి.గ్రా మాత్రమే. అంటే ఇది దాదాపు 36 రెట్లు ఎక్కువ. ప్రకటనల ప్రభావం కూల్‌డ్రింక్స్ అమ్మకాలను పెంచడానికి కంపెనీలు సినిమా తారలు, క్రికెట్ క్రీడాకారులు మరియు ఇతర ప్రముఖులతో ప్రకటనలు ఇస్తూ అసత్య ప్రచారం చేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, పర్యావరణవేత్తలు, మేధావులు కూల్‌డ్రింక్స్‌ను నిషేధించాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆందోళనలు చేపట్టారు. దీంతో కేరళ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే ముందుగా చర్యలు తీసుకుంది. శీతల పానీయాల వల్ల ఆర్థిక నష్టం కూల్‌డ్రింక్స్ వ్యాపారం వల్ల దాదాపు 50,000 కోట్ల రూపాయలు విదేశాలకు వెళ్లిపోతున్నాయి. 300 మి.లీ కూల్‌డ్రింక్ తయారీ ఖర్చు కేవలం ఒక్క రూపాయి మాత్రమే కాగా, అదే పానీయం 20 రూపాయలకి అమ్ముతున్నారు. కంపెనీలు భారీ లాభాలు పొందుతున్నాయి. అలాగే హైదరాబాదులో ఒక లీటర్ నీటిని ప్రభుత్వం ఒక రూపాయికి ఇస్తే, అదే నీటిని బహుళజాతి కంపెనీలు 12 రూపాయలు 14 రూపాయలకి "మినరల్ వాటర్"గా అమ్ముతున్నాయి. ఆరోగ్యపరంగా, సామాజికంగా, ఆర్థికంగా కూల్‌డ్రింక్స్ వల్ల భారీ నష్టం జరుగుతోంది. కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల నష్టాలు పోషక విలువలు ఉండవు అధిక క్యాలరీలు స్థూలకాయం మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతుంది ఫ్రక్టోజ్ వల్ల అధిక రక్తపోటు ఫాస్ఫారిక్ ఆమ్లం వల్ల ఎముకల బలహీనత పళ్ల ఎనామిల్ పొర దెబ్బతిని పిప్పిపళ్లు ఏర్పడతాయి కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి మెటబాలిక్ సిండ్రోమ్ సంభవిస్తుంది యాసిడ్ వల్ల ఛాతిలో మంట కలుగుతుంది లివర్ సిరోసిస్ వచ్చే అవకాశం ఉంది జీర్ణవ్యవస్థలో సమస్యలు కార్బన్ డైఆక్సైడ్, ఫాస్ఫారిక్ ఆమ్లాలు క్యాన్సర్ ప్రమాదం ఆస్పార్టేమ్ గట్ హెల్త్ దెబ్బతింటుంది సోడియం బెంజోయేట్ కణ వ్యవస్థకు నష్టం పురుగుమందుల అవశేషాల అనేక దుష్ప్రభావాలు భూగర్భ జలాల తగ్గుదల, పర్యావరణ నష్టం ప్రకృతి సిద్ధ సహజ పానీయాలను తాగుదాం నిమ్మరసం మంచినీటిలో నిమ్మరసం, చక్కెర బెల్లం, ఉప్పు కలిపి తాగాలి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చెరకురసం చెరకురసం వడగట్టి, నిమ్మరసం, మిరియాల పొడి కలిపి చల్లగా తాగాలి. మసాలా మజ్జిగ, పెరుగు, నీరు, మిర్చి, అల్లం, కరివేపాకు, ఉప్పు, నిమ్మరసం పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. కొబ్బరి నీళ్లు శరీరానికి చల్లదనం, జీర్ణానికి మేలు. గంజి శర్బత్ గంజిలో ఉప్పు, మజ్జిగ కలిపి తాగితే వడదెబ్బ నివారిస్తుంది. రాగి అంబలి, రాగి పిండి, ఉడికించి, మజ్జిగ/బెల్లం కలిపి తాగాలి వేసవిలో చల్లదనం ఇస్తుంది. వేసవి పానకం బెల్లం నీరు, మిరియాలు, యాలకులు శరీరానికి శక్తి, చల్లదనం ఇస్తుంది. పండ్ల రసాలు పుచ్చకాయ, నారింజ, బొప్పాయి, దానిమ్మ, అనాస, ద్రాక్ష, సపోటా కూల్‌డ్రింక్స్ కంటే చాలా ఆరోగ్యకరమైనవి. సహజ సిద్ధమైన పానీయాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కూల్‌డ్రింక్స్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అందుకే సహజ సిద్ధమైన పానీయాలు తాగుదాం -- ఆరోగ్యాన్ని కాపాడుదాం.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు'

'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి

## ఆలయాల్లో ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణ కార్యక్రమం.





**కారేపల్లి మార్చ్ 19 పెన్ పవర్:** నూతన తెలుగు సంవత్సరాది పరాభవ నామ సంవత్సరం రోజున సింగరేణి మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు పంచాంగ శ్రవణ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఆలయాలలో జలాభిషేకాలతో కడిగి మామిడి తోరణాలతో అలంకరించి విద్యుత్ దీపాల వెలుగులో తీర్చిదిద్దారు. మండల పరిధిలోని మాదారం రామాలయంలో ఆలయ పూజారి సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం గ్రామస్తులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ.. గ్రామస్తులకు వారి పేర్ల ఆధారంగా రాశిఫలితాలను వివరించారు. పరాభవనామ సంవత్సరంలో కలుగబోయే శుభఫలితాలు, వ్యవసాయ పరిస్థితులు, ఆరోగ్య పరిరక్షణ, విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలు వంటి వాటిపై సమగ్రంగా విశ్లేషణ చేశారు. శుభ ఉగాదిఈ సంవత్సరం పేరు 'పరాభవ' పరాభవం అంటే ఓటమి, అపజయం గనక మనకి కొద్దిపాటి భయం కలగడం సహజమే! అన్నారు. ప్రభవాది 60 సంవత్సరాల్లో 40వ సంవత్సరమే ఈ 'పరాభవ నామ సంవత్సరం'. కొన్ని పేర్లలో ప్రతికూల స్వభావం ధ్వనిస్తుంటుంది. అలాంటి వాటిలో పరాభవం కూడా ఒకటి. అయితే, పేరును బట్టి అపజయం, అవమానం వంటివి కలుగుతాయనుకోవడం సరికాదు అని తెలిపారు. జీవితం అంటేనే జయాపజయాలు, సుఖదుఃఖాల మేలి కలయిక. అని అన్నివేళలా అన్ని కార్యాల్లో విజయాలే వరించడం అసాధారణం కదా! అప్పుడప్పుడూ పరాభవం తప్పదని నిజానికి ఇది అవసరం కూడా. ఎప్పుడూ విజయాలే ఉంటే దాని అనుభూతి కొన్నాళ్లకు సన్నగిల్లుతుంది. తెలిపారు. పరాభవం తర్వాత వచ్చే విజయం రెట్టింపు ఆనందాన్ని ఇస్తుందన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో గల శివాలయం పెద్దమ్మ తల్లి గుడి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఇందిరమ్మ ఇంటి పథకంతో పేదల సొంతింటికల సాకారం.


- త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి.
- కూనంనేని కృషితో వేగవంతంగా 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.
- సాంకేతిక లోపాలు సరిదిద్ది వెంటనే బిల్లులు చెల్లించాలి.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.
- గృహప్రవేశ ఉత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సాబీర్ పాషా.



**కొత్తగూడెం మార్చి 19పెన్ పవర్:** పేదల సొంతింటి కల సాకారం కావడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చాతకొండ గ్రామపంచాయతీ డ్రైవర్స్ కాలనీలోని షేక్ సాహేరా నిర్మించుకున్న ఇందిరమ్మ పథకం గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ వజ్జ ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మంద గాబ్రియేలులతో కలిసి గురువారం అయన పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా సాగుతోందనిత్వరలో రెండో దఫా ఇండ్లు మంజూరుకానున్నాయని తెలిపారు. గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా పేదలను ప్రోత్సహించాలని, నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఈ పథకం సజావుగా సాగేలా చూడాలని సూచించారు. శాసనసభ సభ్యులు కూనంనేని సూచనలు, సలహాలతో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో సర్పంచి వజ్జా ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మందా గాబ్రియేల్, స్థానిక నాయకులు మల్లు జ్యోతిబసు, మంద నిర్మల, షబానా, సాయి, సోని, సఫీనా, రజియా తదితరులు పాల్గొన్నారు.

## నేడు పండితాపురం పశువుల సంత వేలం.

- సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ మల్లికార్జున్, కార్యదర్శి శంకర్.



**కామేపల్లి మార్చి 19 పెన్ పవర్:** కామేపల్లి మండలం కొమ్మినేపల్లి పంచాయితీ పరిధిలోని పండితాపురం శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల సంత బహిరంగ వేలంను శుక్రవారం ఉదయం 10 గంటలకు సంత ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి జి.శంకర్ గురువారం తెలిపారు. ఏప్రిల్ 1, 2026 నుండి మార్చి 31, 2027 వరకు సంత నిర్వహణకు గాను వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని గిరిజనులు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్ సొమ్ము, రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.30,00,000 తో పాటు సాల్వెన్సీ కింద రూ.5,00,000 డిడి లేదా నగదు రూపంలో పంచాయతీ కార్యదర్శి కొమ్మినేపల్లి పేరుతో డిపాజిట్ గా చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు. పాట పాడేవారు కనిష్టంగా రూ.10, గరిష్టంగా రూ.50 వరకు పాడాలని కోరారు.హెచ్చు పాటదారుడు పాడిన వెంటనే మొత్తం1/3 వంతు పైకంను సాయంత్రం 4 గంటల లోపు చెల్లించాలని కోరారు.మిగిలిన మొత్తం పైకం 9 సమాన వాయిదాలలో 31 డిసెంబర్ 2026 వరకు చెల్లించాలని కోరారు. లేని యెడల హక్కులు రద్దుపరిచి చట్ట రీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# భట్టి చొరవతో ఖమ్మం రహదారులకు మహర్దశ.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కృషితో రూ.594 కోట్లు మంజూరు.
- జిల్లాలో ఐదు కీలక మార్గాల విస్తరణకు గ్రీన్ సిగ్నల్.
- నాలుగు వరుసల రోడ్లుగా ఆధునికీకరణ.. మారనున్న రవాణా ముఖచిత్రం.
- ఉగాది పండుగ పూట ఖమ్మం ప్రజలకు తీపి కవరు.

**ఖమ్మం మార్చి 19 పెన్ పవర్: :**

ఖమ్మం జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు మహర్దశ కల్పిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసాధారణ చొరవ చూపారు. ఆయన పట్టుదలతో జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణకు (జీవో ఎంఎస్ 15 /16-03-2026) ఏకంగా రూ.594 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కీలక మార్గాలను నాలుగు వరుసల (ఫోర్ లేన్) రహదారులుగా అభివృద్ధి చేయనున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఆయన పాత్ర కీలకం. ఈ రహదారుల వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ రహదారుల విస్తరణను ప్రభుత్వం చేపడుతోంది. ఈ రదారుల విస్తరణ వల్ల ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గంలో కనెక్టివిటీ పెరగండతో పాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుంది.

**రహదారులు విస్తరణ**

1. వైరా నుండి జగ్గయ్యపేట వరకు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు వరుసల రహదారిగా విస్తరణ
జగ్గయ్యపేట, బోనకల్ , రావినూతల, ముజఫర్ నగర్, జానకీపురం, పెద్దబీరవల్లి, పాలడుగు, సీతానగరం, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి, జింకల తాండా. సోమవరం మీదుగా వైరా వరకు. ఈ రహదారి మొత్తం 25.2 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.151.20 కోట్ల నిధుల మంజూరు
2. మధిర నుంచి తూటికుంట్ల వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణ. మధిర, జిలుగుమాడు, ఆత్కూరు, కిష్టాపురం, సిరిపురం, కలకోట, బ్రాహ్మణపల్లి మీదుగా తూటికుంట్ల వరకు విస్తరణ. ఈ రహదారి మొత్తం 13.50 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 81 కోట్ల నిధుల మంజూరు.
3. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. మధిర, ఎల్లెందులపాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఈ రహదారి మొత్తం 18.40 కిలోమీటర్ల మేర రూ.110.40 కోట్ల నిధులు మంజూరు.
4. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 28.03 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.157.23 కోట్ల నిధుల మంజూరు.
5. బోనకల్-ఆళ్లపాడు, రాయన్నపేట-వంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. బోనకల్, ఆళ్లపాడు, రాయన్న పేట మీదుగా వంగవీడు వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ.94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.

# ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషిచేయాలి.






- ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు

**నేలకొండపల్లి పెన్ పవర్: :**

నేలకొండపల్లి కేంద్రంలో గురువారం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషిచేయాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గువ్వలగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు ఉగాది పండుగ పర్వదినాన ముదిగొండ మండలం సువర్ణగిరి రెవెన్యూ గ్రామంలోని వృద్ధగిరి లక్ష్మీ నరసింహస్వామి గుట్టను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో సందర్శించి గుట్ట ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు ప్లాస్టిక్ వాడకం మానవ జీవితంలో భాగంగా మారిపోయిందని, ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ ను విచ్చలవిడిగా వాడి ఎక్కడపడితే అక్కడ వదిలివేయడం వలన అది అనేక అనార్థాలకు దారితీస్తుందన్నారు. స్వామివారిని దర్శించుకునే భక్తులు ప్లాస్టిక్ కవర్లను గుట్ట ప్రాంగణంలో పడవేయరాదని సూచించారు. మానవ జీవితానికి హానికల్గించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, తప్పనిసరి పరిస్థితులలో ప్లాస్టిక్ ను వాడిన తరువాత ఎంపిక చేసిన ప్రదేశాలలో మాత్రమే పడవేసి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## తేకడ గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా.


**చర్ల మార్చి 19 పెన్ పవర్:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తేగడ గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం ఉగాది సంబరాలు ఘనంగా కమిటీ వారు గ్రామస్తులు సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం వేళల నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉగాది పచ్చడి పులిహోర పంపిణీ చేయగా, భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కుబడులు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## తేగడ శివాలయంలో శివ పరివార దేవతలుకు రుద్రాభిషేకాలు పట్టు వస్త్ర అలంకరణ.

**చర్ల మార్చి 19 పెన్ పవర్:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దేవాలయంలో ఉదయం 4 గంటల నుండి ఆలయ శుద్ధి కార్యక్రమాలు 7 గంటల నుండి శివ పరివార దేవతలు అందరికీ విశేష రుద్రాభిషేకాలు పట్టు వస్త్ర అలంకరణ జరిగింది. తదుపరి 10 గంటల నుండి మహా గణపతి పూజ. సుబ్రహ్మణ్య స్వామి వారికి అష్టోత్తర శత నామ అర్చన వీరేశ్వర స్వామి కి విశేష లఘు న్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. పురాతన మూర్తికి ఒక అజ్ఞాత భక్తురాలు గంగ యమున సరస్వతీ త్రివేణీ సంగమం నుండి లింగాల గోదావరి జలాలు తో పురాతన మూర్తికి విశేష రుద్రాభిషేకం జరిగింది. మూడు రోజుల పాటు అఖండ దీప సాక్షిగా స్వామి వారు నిజ రూపంలో కొలువు తీరి ఉండనున్నారు. ఈ కార్యక్రమం లో అతి పురాతన మహా మహి మాన్విత భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దర్శనము కోసం తే గడ గ్రామం తో పాటు చుట్టు పక్క ల గ్రామాల వారు కూడా దర్శనం కోసం తరలి వచ్చారు. రాత్రి 7 గంటల కు ఆలయ నిర్వాహకులు. యల్లమందల.శ్రావణ కుమార్ ఆద్వర్యంలో అర్చకులు భాను ప్రకాష్.పంచాంగ శ్రవణము చేయనున్నారు. ఈ కార్యక్రమంలో యల్లమందల శివ ప్రతాప్, నాగేంద్రయ్య, ప్రవీణ్ కుమార్, చక్రవర్తి, జగదీష్, నాగవేణి, భవానీ, సోమేశ్వరి, జ్యోత్స్న రమణి, జోష్నా లక్ష్మీ శ్రీ,అభినవ్, భావన. పేకేటి సుబ్బారావు, మాధురి, సాయి శృతి, విద్య, మద్ది. భాస్కర్ రెడ్డి. ఆలవాల పార్వతీ, పంచాయతీ సర్పంచ్ జమ్ముల మురళి ఉప సర్పంచ్ పాగా. రాంప్రసాద్ తదితరుల భక్తులు పాల్గొన్నారు.

## అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి చంద్రుగొండలో ఘనంగా సన్మానం.




**నేలకొండపల్లి మార్చి 19 పెన్ పవర్:**

నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో యూత్ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మోటివేషనల్ స్పీకర్ గా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దివ్యమూర్తి యువతను విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత మంచి అలవాట్లతో మంచి అభ్యుదయ భావాలు కలిగి సమాజంలో ఈ పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలని అన్నారు. నేటి యువత రేపటి భావితరాలకు స్ఫూర్తి అని తెలియజేశారు. అక్కడ యువత గుగ్గిళ్ళ దివ్యమూర్తి మా ప్రాంతానికి రావడం గొప్ప విషయమని అన్నారు. తదనంతరం దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ.. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 126 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో చాపలమడుగు వీరబాబు, కుక్కమూడి బాల ప్రసాద్, పాస్టర్ మోజెస్, వార్డుమెంబర్ కృష్ణ,చాపలమడుగు రాములు , కాకటి నతానియేలు, కాకటి తిమోతి, కుక్కమూడి చిట్టిబాబు, చాపలమడుగు రమణ, నారపోగు అశోక్, చాపలమడుగు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ.

- అమరవీరుల ఆశయాల సాధన లక్ష్యం.
- పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వి రాకేష్.




**రేపల్లి మార్చ్ 19 పెన్ పవర్:**

దేశ విముక్తిలో ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాల సాధన లక్ష్యంగా ముందుకు సాగాలని పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వి రాకేష్ అన్నారు.విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని పి వై ఎల్ పి డి ఎస్ యుసంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో రాజ్యమేలుతున్న సామ్రాజ్యవాద ధోరణులపై యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని రగిలిస్తూ దేశాల సార్వభౌమాధికారాన్ని కాలరాస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత గళమెత్తాలని పిలుపునిచ్చారు. విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉన్న 'నూతన జాతీయ విద్యా విధానం - 2020'ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే మనందరి లక్ష్యం అని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, నేటి దోపిడీ పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు జరిగే ఈ పోరాట సభల్లో విద్యార్థులు, యువత, మేధావులు సామాజిక విప్లవకారులు ఉప్పెనలా తరలివచ్చి విజయవంతం చేయాలనివిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్, పి వై ఎల్ డివిజన్ నాయకులు కనకరాజు, ప్రకాష్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం.

- కారేపల్లి లో మల్లు స్వరాజ్యం వర్ధంతి.

**హైదరాబాద్ పెన్ పవర్:**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఐద్వా వ్యవ స్థాపకుల్లో ఒకరైన మల్లు స్వరాజ్యం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి అన్నారు. స్వరాజ్యం 4వ వర్థంతిని పురస్కరించుకొని బుధవారం కారేపల్లి లో ఆమె చిత్రపటాల వద్ద ఐద్వా నాయకురాళ్లు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఉమావతి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తిని కొనియాడారు. 12 ఏళ్ల వయస్సులోనే వెట్టి చాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా నాటి దొరలు, జాగీరుదారులపై పోరాటం చేసిన గొప్ప నాయకురాలన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నీడలో, పేదల పక్షాన నిలిచారన్నారు. ఆమె చూపిన పోరాట స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం పోరాడుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు చిత్తారు రమాదేవి, ఇదిగాని అనిత, ఏనుగుల పద్మ, కొండబోయిన రమ్య, ఇదిగాని లింగమ్మ, శ్రావ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

## బీమా రంగంలో ఎఫ్‌డిఐలను పెంచుతాం..

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచుతామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆరోగ్య బీమా కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. 2033 నాటికి అందరికీ బీమా లక్ష్యాన్ని చేరుకుంటామని మంగళవారం మంత్రి రాజ్యసభలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. బీమా రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో ఇప్పటికే 58 కోట్ల మందికి బీమా రక్షణ లభించిందని వెల్లడించారు. బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచడం ద్వారా మార్కెట్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో తలసరి బీమా ప్రీమియం కేవలం 97 డాలర్లుగా ఉందన్నారు. ఇది ప్రపంచ సగటు 943 డాలర్లు కంటే చాలా తక్కువని మంత్రి వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడానికి జిఎస్‌టి మినహాయింపులు, గ్రామీణ ప్రాంతాల్లో బీమా విస్తరణ వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలోని పేద ప్రజల కోసం పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలు కేవలం రూ.436 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల రక్షణ కల్పిస్తున్నాయని, ఆయుష్మాన్ భారత్ పథకం కింద 12 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స సౌకర్యం అందుతోందన్నారు.

# గ్లోబల్ ఎనర్జీపై ఇరాన్ ‘మెరుపు’ దాడి.. భారత్‌కు పెను ముప్పు!



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో మునుపెన్నడూ లేని విధంగా ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ తన వ్యూహాత్మక లక్ష్యాలను విస్తరిస్తూ ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ వంటి ఖతార్‌లోని రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై క్షిపణి దాడులకు దిగడం అంతర్జాతీయ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ దాడుల ప్రభావంతో ప్రపంచ చమురు, గ్యాస్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలే పరిస్థితికి చేరుకున్నాయి.

**రస్ లాఫాన్.. ప్రపంచ ఎల్ఎన్‌జీ కేంద్రంపై దాడి**

ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా ఉన్న రస్ లాఫాన్ నగరం.. ప్రపంచంలోనే అతిపెద్ద లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్.ఎన్.జీ) ఎగుమతి కేంద్రం. ఇక్కడి నుంచే ప్రపంచంలోని అనేక దేశాలకు గ్యాస్ సరఫరా అవుతుంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఇక్కడి గ్యాస్ ప్రాసెసింగ్ యూనిట్లు, భారీ నిల్వ ట్యాంకులను లక్ష్యంగా చేసుకున్నాయి. ఖతార్ ఎనర్జీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ దాడుల వల్ల ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. అత్యవసర సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నప్పటికీ గ్యాస్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన భద్రతకు అత్యంత కీలకమైన ఈ కేంద్రంపై దాడి జరగడం అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై నేరుగా దాడి చేయడమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**విస్తరిస్తున్న దాడులు.. యూఏఈ, ఒమన్ తీరాల్లో అలజడి**

ఇరాన్ దాడులు కేవలం ఖతార్‌కే పరిమితం కాలేదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని కీలకమైన బాబ్ ఆయిల్ ఫీల్డ్, హబ్‌షాన్ గ్యాస్ కాంప్లెక్స్‌లను కూడా ఇరాన్ లక్ష్యం చేసుకుంది. హబ్‌షాన్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌షోర్ గ్యాస్ ప్రాసెసింగ్ కేంద్రాలలో ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో యూఏఈ ప్రభుత్వం అక్కడ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. మరోవైపు ఒమన్ తీరానికి సమీపంలో సముద్ర మార్గాల్లో ప్రయాణించే ట్యాంకర్లపై కూడా దాడులు పెరిగాయి. ఇప్పటివరకు సుమారు 20కి పైగా నౌకలు ఈ దాడుల బారిన పడ్డట్లు సమాచారం. దీనివల్ల ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా రవాణా ప్రమాదంలో పడింది.

**ప్రపంచ మార్కెట్లపై ప్రభావం: భారత్‌కు పెను ముప్పు**

ఈ పరిణామాల ప్రభావం తక్షణమే ప్రపంచ మార్కెట్లపై కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర ఒక్కసారిగా బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరుకుంది. భారత్ తన అవసరాల కోసం దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీలో దాదాపు 40-47 శాతం ఖతార్ నుంచే వస్తుంది. విద్యుత్ ఉత్పత్తి, ఎరువుల తయారీ, పారిశ్రామిక అవసరాలతో పాటు గృహ వినియోగం అంతా ఈ గ్యాస్‌పైనే ఆధారపడి ఉంది. సరఫరాలో అంతరాయం కలిగితే భారత్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, సామాన్యుడిపై భారం పడే అవకాశం ఉంది.

**అంతర్జాతీయ స్పందన: హెచ్చరించిన ట్రంప్, సౌదీ అరేబియా**

ఈ దాడులను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ ఖతార్‌పై దాడిని “అమాయక దేశంపై దాడి”గా అభివర్ణించారు. ఇరాన్ గనుక తన వైఖరి మార్చుకోకపోతే ఆ దేశంలోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రాన్ని పూర్తిగా ధ్వంసం చేస్తామని, అపూర్వమైన శక్తితో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. మరోవైపు సౌదీ అరేబియా ఇప్పటికే ఎనిమిది బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ మాట్లాడుతూ తమ ప్రాంతీయ భద్రతకు ముప్పు కలిగితే సైనిక చర్యకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. రియాద్‌లో సమావేశమైన 12 అరబ్-ఇస్లామిక్ దేశాలు సౌదీ, యూఏఈ, పాకిస్థాన్, తుర్కియే తదితరులు ఇరాన్ తక్షణమే దాడులను ఆపాలని డిమాండ్ చేశాయి.

**చారిత్రక నేపథ్యం: నార్త్ ఫీల్డ్ ప్రాముఖ్యత**

1971లో కనుగొనబడిన నార్త్ ఫీల్డ్ (ఖతార్).. సౌత్ పార్స్ (ఇరాన్) గ్యాస్ క్షేత్రం ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వాయువు నిల్వ. ఈ వనరును ఉపయోగించుకునే ఖతార్ ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశాల్లో ఒకటిగా ఎదిగింది. 1996లో మొదటి ఎగుమతి ప్రారంభించిన ఖతార్, నేడు ఏడాదికి 77 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు అదే వనరును దెబ్బతీయడం ద్వారా ఇరాన్ ప్రపంచాన్ని ఇంధన సంక్షోభంలోకి నెట్టాలని చూస్తోంది. పశ్చిమాసియాలో మండుతున్న ఈ మంటలు చల్లారకపోతే, అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడి ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ప్రపంచం మొత్తం పశ్చిమాసియా వైపు ఆందోళనతో చూస్తోంది.

# ఆసిఫాబాద్ జిల్లాలో యువతులను విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు.. ముగ్గురు అరెస్ట్






**హైదరాబాద్ పెన్ పవర్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో యువతుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జిల్లానుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా అమ్మాయిలను రవాణా చేస్తున్నారు. పెళ్లి, డబ్బు, ఉపాధి ఆశజూపి ఆసిఫాబాద్ జిల్లానుంచి యువతులను మధ్యప్రదేశ్ తరలిస్తున్న ముఠాకు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..

కుమ్రంభీం అసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ లో అమ్మాయిల అమ్మకాల దందా గురువారం(మార్చి19) బయటపడింది. బెజ్జూర్ నుంచి ఇద్దరు అమ్మాయిలను తీసుకెళ్లి మధ్యప్రదేశ్ లో అమ్ముతున్న ముఠాలోని ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు అమ్మాయిలను తరలిస్తుండగా మంచిర్యాల , మధ్యప్రదేశ్ కు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

గత కొంతకాలంగా బెజ్జూర్ లో అమ్మాయిల అక్రమ రవాణా సాగుతోంది. కొంతమంది ముఠాగా ఏర్పడి అమ్మాయిలను కొనుగోలు చేసి మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు అక్రమంగా అమ్మాయిలను తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఒక్కో అమ్మాయికి రూ. 2.50లక్షలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజన వర్గాలకు చెందిన అమాయక యువతులు, ఒంటరి మహిళలు, వితంతువులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారిని వ్యభిచార గృహాలకు తరలించడంతో పాటు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ వంటి ఉత్తర రాష్ట్రాల్లోని ఉన్నత కుటుంబాలకు చెందిన పురుషులతో బలవంతంగా వివాహం చేస్తున్నారు. ఈ కార్యకలాపాల ద్వారా నేరగాళ్లు త్వరితగతిన డబ్బు సంపాదిస్తున్నారు అని పోలీసులు చెబుతున్నారు.

# మెహదీపట్నంలో ఆర్టీసీ బస్సు ఢీకొని.. స్కూటరిస్టు మృతి





**హైదరాబాద్ పెన్ పవర్:** అతివేగం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. వేగంగా వచ్చిన బస్సు వెనకనుంచి స్కూటర్ ను ఢీకొట్టడంతో స్కూటరిస్టు అక్కడికక్కడే చనిపోయాడు. హైదరాబాద్ నగరంలోని మెహదీపట్నంలో గురువారం(మార్చి19) సాయంత్రం ఈ ఘటన జరిగింది వివరాల్లోకి వెళితే.. మెహదీపట్నం డిపోకు చెందిన మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సు అతివేగంతో వచ్చి స్కూటర్ ను ఢీకొట్టింది. బస్సుముందు వెళ్తున్న స్కూటర్ ను వెనకనుంచి బలంగా ఢీకొట్టడంతో స్కూటర్ పై వెళ్తున్న వ్యక్తి కిందపడిపోయాడు. అతని తలపైనుంచి బస్సు టైర్లు వెళ్లడంతో స్పాట్ లోనే చనిపోయాడు. మొయినాబాద్ తాజ్ హోటల్ సమీపంలో బీజాపూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# శ్రీ పరాభవలో ఎన్నో శుభ ముహూర్తాలు !

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు వారికి కొత్త సంవత్సరం వచ్చేసింది. . దాని పేరు శ్రీ పరాభవ నామ సంవత్సరం. మరి చైత్రం నుంచి ఫాల్గుణం వరకూ పన్నెండు తెలుగు నెలలు ఉండే ఈ ఏడాదిలో ఎన్ని శుభ ముహూర్తాలు ఉన్నాయన్నది అందరికీ తెలుసుకోవాలని ఉంటుంది. గత ఏడాది అయితే శుభ ముహూర్తాలు తక్కువగా ఉన్నాయి. పైగా మూఢాలతో పుణ్యకాలాలు వెళ్ళిపోయాయి. మరి శ్రీ పరాభవ నామ సంవత్సరం అయినా శుభాలను మోసుకొస్తుందా అన్నది అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ఏడాది మంచి ముహూర్తాలు శుభ ఘడియాలు చాలానే ఉన్నాయని పండితులు చెబుతున్నారు.




**ఉగాది అంటే ఏంటి :**

యుగానికి ఆరంభం అన్నది ఉగాదిగా చెబుతారు. ఇక్కడ ఏడాదికి తొలి రోజు అని అర్థం గా చూడాలి. తెలుగు సంవత్సరాది విశిష్టత ఏంటి అంటే ప్రకృతిని దృష్టిలో ఉంచుకుని సాగుతుంది. ఉగాది చైత్రంలో వస్తుంది అంటే ప్రకృతి పూస్తుంది. చిగురులు పెడుతుంది. అంతా వికసిస్తుంది. ఇక ఆ తరువాత వర్షాకాలం వస్తుంది. దాంతో శ్రావణ భాద్రపదాలు వర్షాలకు సూచికంగా చెబుతారు. ఇక శీతాకాలానికి సంకేతంగా తీసుకుంటే కార్తీకం మార్గశిరం పుష్య మాసాలను చెబుతారు. అలా కాలలకు తగినట్లుగా పండుగలు కూడా ఉంటాయి. అందుకే తెలుగు సంవత్సరాదినే ప్రకృతికి ప్రతిబింబంగా చూస్తారు.

**శుభాలకు కూడా కేంద్రంగా :**

మొత్తం పన్నెండు మాసాలు ఉంటే అందులో అన్ని మాసాలూ శుభాలకు ప్రమాణంగా తీసుకోరు ఇందులో ఆషాడం, భాద్రపదం, పుష్యం మాసాలను శూన్య మాసాలుగా చెబుతారు. ఈ మాసాలలో ఎటువంటి శుభ కార్యాలు చేసుకోరు. ఎక్కువగా శుభాలు జరిగేవి చెప్పాలంటే చైత్ర వైశాఖాలు, అలాగే శ్రావణ మాసం, కార్తీకం, మాఘ మాసాలను పేర్కొంటారు. అంతే కాదు ఉత్తరాయనంలో చేసే శుభాలు ఉంటాయి. దక్షిణాయనంలో చేసే కార్యక్రమాలు ఉంటాయి. ఉత్తరాయనంలో ఉపనయనాలు గృహ ప్రవేశాలు చేసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. మకర సంక్రాంతి తరువాత సూర్యుడు తన దిశను మార్చుకుంటాడు. దానిని బట్టి ఉత్తరాయనంలోకి సూర్యుడు ప్రవేశించాడు అని చెబుతారు అలా ఆరు నెలల పాటు అంటే జూన్ దాకా ఉత్తరాయనం కొనసాగుతుంది.

**వివాహాది శుభాలకు :**

ఇక శ్రీ పరాభవ నామ సంవస్తరంలో చైత్రమాసంలో కొత్త వ్యాపారాలకు మార్చి 27, ఉపనయనాలు వ్యాపారాలు, శంకుస్థాపనలకు మార్చి 28వ తేదీ దివ్యంగా ఉంటుంది అని చెబుతున్నారు. వివాహాలకు మార్చి 29 ఎంతో అనుకూలమైనదిగా పేర్కొంటున్నారు. అదే విధంగా మే నెలలో 1, 3, 6, 7,8, 9, 10, 11లలో వివాహాలకు వ్యాపారాలలకు గృహ ప్రవేశాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అలాగే జూన్ నెలలో 17 నుంచి జూలై 9 వరకూ చూస్తే అన్నీ మంచి రోజులే ఉన్నాయి. ఈ సమయంలో వివాహాలు చేసుకోవచ్చు, గృహ ప్రవేశాలు చేసుకోవచ్చు అని పండితులు చెబుతున్నారు.

**అనుకూలించే తేదీలు :**

ఇక శ్రావణ మాసంలో చూస్తే ఆగస్టు 15, 16, 20, 22 తేదీలలో పెళ్ళిళ్ళకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. కార్తీక మాసంలో చూస్తే నవంబర్ 12 నుంచి 22 వరకూ పెళ్ళిళ్ళ సీజన్ గా చెప్పాలి. మంచి ముహూర్తాలు ఈ నెలలో ఇవే అని అంటున్నారు. ఇక్కడ నుంచి చూస్తే 2027 ఫిబ్రవరి లోనే అంటే మాఘమాసంలోనే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి 29 వరకు వరసగా మంచి రోజులు అన్నీ వివాహాది శుభ కార్యాలకు అనుకూలించేవి అని అంటున్నారు. ఇక 2027 లో ఫాల్గుణ మాసంలో అంటే మార్చి 10 నుంచి ఏప్రిల్ 2 వరకూ శుభ ముహూర్తాలు అనేకం ఉన్నాయి. ఈ సమయంలో వివాహాలు గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు ఎంతో మేలు అని పండితులు చెబుతున్నారు.

# ‘జెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ నౌకకు ఏమైంది..? నాటో స్థావరం వైపునకు కదికలో ఆంతర్యం ఏంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** సముద్రం నడిబొడ్డున కోటలాంటి విమాన వాహక నౌక ఉంటే శత్రువులకు వెన్నులో వణుకు పుట్టాల్సిందే. కానీ, అమెరికా గర్వకారణంగా చెప్పుకునే ‘జెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ విషయంలో కథ అడ్డం తిరిగింది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన, శక్తిమంతమైన ఈ యుద్ధనౌక, శత్రువుల క్షిపణుల వల్ల కాకుండా తన ఇంట్లోనే జరిగిన ఒక ‘నిప్పు’ వల్ల ఇప్పుడు యుద్ధ క్షేత్రాన్ని వీడాల్సి రావడం అంతర్జాతీయ రక్షణ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. అసలు ఆ రాత్రి ఏం జరిగింది? ఒక చిన్న లాండ్రీలో మొదలైన మంటలు 30 గంటల పాటు ఎలా కొనసాగాయి? అనే ఉత్కంఠభరితమైన వివరాల్లోకి వెళ్తే..



**యుద్ధక్షేత్రం నుంచి నిష్క్రమణ**

పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతున్న సమయంలో, అమెరికాకు చెందిన అత్యాధునిక విమాన వాహక నౌక ‘జెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ అనూహ్యంగా యుద్ధ క్షేత్రం నుంచి వైదొలిగింది. ప్రస్తుతం ఇది మెల్లగా గ్రీస్‌లోని నాటో (చీూు) స్థావరమైన క్రెటె వైపు మరమ్మతుల కోసం ప్రయాణిస్తోంది. ఎర్ర సముద్రం మీదుగా సాగుతున్న ఈ ప్రయాణం వెనుక ఉన్న అసలు కారణం శత్రువుల దాడి కాదు, నౌక లోపల సంభవించిన భారీ అగ్నిప్రమాదమే. యుద్ధం కీలక దశలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రధాన నౌక వెనుదిరగడం అమెరికా నౌకాదళానికి పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**30 గంటల భీభత్సం!**

మార్చి 12వ తేదీన ఈ భారీ నౌకలోని లాండ్రీ విభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెంటగాన్ వర్గాలు ఈ ప్రమాదం తీవ్రతను తగ్గించి చూపించిన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు భయంకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఈ అగ్నికీలలు ఏకంగా 30 గంటల పాటు ఆగకుండా మండుతూనే ఉన్నాయి. ఒక అత్యున్నత సాంకేతికత కలిగిన నౌకలో మంటలను ఆర్పడానికి ఇంత సుదీర్ఘ సమయం పట్టడం ఆ నౌకలోని ఫైర్ సేఫ్టీ వ్యవస్థలపై అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది.

**600 మంది సైనికుల బెడ్లు దగ్ధం!**

ఈ ప్రమాదంలో ఇద్దరు సైలర్లకు గాయాలవ్వగా, ఆస్తి నష్టం ఊహించని స్థాయిలో జరిగింది. నౌకలోని సుమారు 600 మంది సిబ్బందికి సంబంధించిన బెడ్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అంటే వందలాది మంది సైనికులు ఇప్పుడు నివసించడానికి సరైన వసతి లేని పరిస్థితి నెలకొంది. అందుకే తక్షణం చేయగలిగిన మరమ్మతులు పూర్తి చేసుకోవడానికి క్రెటెలోని సౌద బేకు ఈ నౌకను తరలిస్తున్నారు. క్యారియర్ స్ట్రైక్ గ్రూపులోని మిగిలిన నౌకలు మాత్రం ఇప్పటికీ యుద్ధ క్షేత్రంలోనే ఉండి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి.

13 బిలియన్ డాలర్లతో తయారైన ‘జెరాల్డ్ ఆర్ ఫోర్డ్’ వంటి నౌక, ఒక అగ్నిప్రమాదం వల్ల ఇలా యుద్ధం నుంచి తప్పుకోవడం అమెరికా ప్రతిష్టను దెబ్బతీసే అంశమే. శత్రువులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్న అగ్రరాజ్యం, తన సొంత నౌకల్లోని అంతర్గత భద్రతా లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ఈ ఘటన గుర్తు చేస్తోంది. యుద్ధ విమానాల రక్షణ లేకుండా ఈ నౌక ఇప్పుడు ఒంటరిగా గ్రీస్ వైపు వెళ్తుండడాన్ని బట్టి దాని బలహీనతను చాటిచెబుతోంది. మరమ్మతులు ముగించురొని ఇది మళ్లీ ఎప్పుడు యుద్ధ క్షేత్రంలోకి అడుగుపెడుతుందో వేచి చూడాలి.

# గ్లామర్ టు పవర్ : ఏపీలో పవన్.. తమిళనాడులో విజయ్!

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాది రాజకీయాల్లో సినిమా గ్లామర్‌కు, అధికార పీఠానికి విడదీయలేని బంధం ఉంది. గతంలో తమిళనాట ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, ఏపీలో ఎన్టీఆర్ వంటి వారు వెండితెర వేల్పులుగా వెలిగి, అప్రతిహత విజయాలను అందుకున్నారు. అయితే, మారుతున్న కాలంలో ఒక సూపర్ స్టార్ నేరుగా రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ అవ్వడం అంత సులభం కాదని రజనీకాంత్ వెనకడుగు, కమల్ హాసన్ వైఫల్యం నిరూపించాయి. ఈ క్రమంలో ఏపీలో పవన్ కల్యాణ్ సాధించిన అద్భుత విజయం ఇప్పుడు తమిళ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి ఒక ఆశాకిరణంగా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చేనెలలో జరగనున్న తమిళనాడు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీవీకే అధినేత విజయ్ పోటీ చేస్తున్నారు. 2024 ఫిబ్రవరి 2న విజయ్ టీవీకే పార్టీని ప్రారంభించారు. అంతకుముందు కొన్నేళ్లుగా ఆయన 'మక్కల్ ఇయక్కం' అనే పేరుతో ఫ్యాన్ క్లబ్స్ నడిపారు. దీనిద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు తన ఫ్యాన్స్ నే పార్టీ కేడర్ గా మార్చుకుని ఎన్నికల రణక్షేత్రంలోకి దిగారు. ఇక పవన్ కూడా 2009 ఎన్నికల్లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలుత తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువరాజ్యం సారథిగా పనిచేశారు. 2014లో సొంతంగా జనసేన పార్టీని ప్రారంభించి పదేళ్ల పాటు పోరాడి పార్టీని కీలక స్థాయికి తీసుకువచ్చారు. పవన్ కల్యాణ్ 2014లో జనసేనను స్థాపించినప్పుడు ఎన్నికలలో పోటీకి దూరంగా ఉండిపోయారు. ఇక 2019లో ఆయన స్వయంగా రెండు చోట్ల ఓడిపోయారు. కానీ, పదేళ్ల పాటు క్షేత్రస్థాయిలో పోరాడి ఏపీకి డిప్యూటీ సీఎంగా ఎదిగారు. అంతేకాకుండా వంద శాతం స్ట్రైక్ రేటుతో ఎవరికీ దక్కని విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని, వ్యూహాత్మకంగా అడుగులు వేసి 2024లో విజయం సాధించిన పవన్ కల్యాణ్ తమిళనాట విజయ్ కి ఆదర్శంగా మారారని వ్యాఖ్యానిస్తున్నారు.

2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రణరంగంలోకి దిగిన విజయ్ అచ్చం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాదిరిగానే అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. తన సినిమా కెరీర్ పీక్



స్టేజ్‌లో ఉండగానే నటనకు స్వస్తి పలికారు. పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారారు. పవన్ కూడా ఎన్నికలకు ముందు అంగీకరించిన సినిమాలు తప్ప, కొత్తగా మరే సినిమాకు కాల్షీట్లు ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా పవన్ మాదిరిగా విజయ్ కూడా కేవలం గ్లామర్‌ను నమ్ముకోకుండా, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు.

**ఇద్దరి మధ్య కనిపిస్తున్న ముఖ్యమైన పోలికలు**

ఇక రెండు రాష్ట్రాల్లో ఇద్దరు నేతల మధ్య అనేక పోలికలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా ఇద్దరికీ యువ శక్తి ఒక ఆశాకిరణంగా కనిపిస్తోందని చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక యువత ఒక సైన్యంలా నిలబడ్డారని అంటున్నారు. ఇప్పుడు తమిళనాట విజయ్‌కి కూడా అంతేస్థాయిలో ఫాలోయింగ్ కనిపిస్తోందని చెబుతున్నారు. దీనికి ఆయన సభలకు వస్తున్న జన సందోహమే నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. తన అభిమాన సంఘాలను రాజకీయ విభాగంగా మార్చడంలో ఇప్పటికే విజయ్ సక్సెస్ అయ్యారని చెబుతున్నారు.

**విజయ్ ముందున్న సవాళ్లు**

ఇక పవన్ కల్యాణ్ ఒక బలమైన కూటమిని ఏర్పాటు చేసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా చూశారు. కానీ తమిళనాడులో పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అక్కడ ఇప్పటికే డీఎంకే, అన్నాడీఎంకే వంటి బలమైన ద్రావిడ పార్టీలు ఉన్నాయి. విజయ్ ఒంటరి పోరు చేస్తారా లేక పవన్ లాగా మిత్రపక్షాలను కలుపుకుపోతారా అనేది ఆయన భవిష్యత్తును నిర్ణయిస్తుందని చెబుతున్నారు. సినిమా గ్లామర్ ఓట్లను తెచ్చిపెట్టొచ్చు కానీ, పవర్ రావాలంటే పవన్ కల్యాణ్ చూపించిన ఓపిక చాలా అవసరమని అంటున్నారు. పవన్ 2014 నుంచి 2024 వరకు ఎలాగైతే అధికారం కోసం నిరీక్షించారో.. విజయ్ కూడా తమిళ రాజకీయాల్లో ఆ స్థాయి నిలకడను ప్రదర్శిస్తే.. పొరుగు రాష్ట్రంలో పవన్ సృష్టించిన ప్రభంజనాన్ని తమిళనాడులో విజయ్ పునరావృతం చేసే అవకాశం ఉందని అంటున్నారు.

# రికార్డు క్రియేట్ చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే ఏ సహాయం లేనపుడు ఏ అసరా దొరకనపుడు పేదవాడు దక్కున తలుపు తట్టి కోరేది. ప్రజా ప్రతినిధుల ద్వారా అయినా లేదా అధికారుల తరఫున అయినా విన్నపం పెట్టుకుంటే ముఖ్యమంత్రి వద్ద ఉన్న సహాయ నిధి నుంచి వారికి సత్వరమే ఆర్థిక సాయం దక్కుతుంది. ఆ విధంగా ప్రతీ ప్రభుత్వంలో జరుగుతుంది. అయితే ఎక్కువ సాయం అందాలన్నా వేగంగా ఫైల్స్ కదిలి ఆపన్నులకు అవి చేరాలన్నా సీఎం ఆఫీసులోనూ ఆ ఉదారత కనిపించాలి. ఆ విధంగా చూస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 21 నెలల కాలంలో రికార్డు స్థాయిలో పేదలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం లభించింది అని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**ఉగాది వేళ తొలి సంతకం :**

పేదలకు పెద్దపీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వెళ లికొత్త తెలుగు సంవత్సరంలో తొలి రోజున పేదల సంక్షేమం అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై తొలి సంతకం పెట్టడం విశేషం. ఆ విధంగా కూటమి ప్రభుత్వం పేదల పట్ల తన నిబద్ధత చాటుకుంది అని చెప్పాల్సిందే. ఏకంగా రూ.55.63 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదల దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడం విశేషం. దీని ద్వారా 6,787 మంది పేదలకు లబ్ధి కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

**సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,241 కోట్ల సాయం :**

ఇదిలా ఉంటే గడచిన 21 నెలల కూటమి ప్రభుత్వం హయాంలో ఏకంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,241 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ విధంగా సాయం చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఫైనాన్సియల్ అసిస్టెన్స్, వైద్య సహాయం, ఎల్‌ఓసిల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,36,240 మంది పేదలకు లబ్ధి చేకూరింది. ఇక వివరాల్లోకి వెళ్తే 2024లో 15,206 మందికి రూ.184 కోట్లు, 2025లో 1,03,568 మందికి రూ.889 కోట్లు, 2026లో ఇప్పటి వరకు 17,466 మందికి రూ.169 కోట్లతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం సాయం చేసింది.

**మంచి కార్యక్రమం ద్వారా :**

ఇక ఇక తెలుగు నూతన సంవత్సరం తొలి రోజన పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు వారి వైద్యపరమైన అవసరాల నిమిత్తం నిధులకు లోటు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విధంగా అందిన ఆర్థిక సాయంతో వైద్యం చేయించుకుని లక్షలాది మంది అరోగ్యవంతులు అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అయితే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆదుకుంటోంది.

# బెంగాల్ లో బీజేపీ 10 ఏళ్ల పోరాటం.. 2016లో మూడు సీట్లు.. 2026లో...??

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్ లో అధికారం దక్కించుకోడానికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ 10 ఏళు ్లగా పోరాడుతోంది. 2016 నుంచి ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ చేయని ప్రయత్నం లేదని చెబుతున్నారు. పదేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 సీట్లు గెలుచుకున్న బీజేపీ.. ఐదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల నాటికి 77 సీట్లకు ఎగబాకింది. ఈ సారి ఏకంగా అధికారంపైనే గురిపెట్టి మడమ తిప్పని పోరాటం చేస్తోంది. అయితే మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, నాలుగోసారి కూడా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలని భావిస్తున్న ఫైర్ బ్రాండ్ దీదీ మమతా బెనర్జీని ఎదుర్కొని కమలం జెండా ఎగురవేయడం సాధ్యమా? అన్నదే ఆసక్తికర చర్చగా మారింది. 2014లో కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత బీజేపీ దేశవ్యాప్తంగా జైత్రయాత్ర కొనసాగిస్తోంది. దేశంలోని నలు దిక్కులా ఆ పార్టీ విస్తరించింది. ఈశాన్య రాష్ట్రాలలోనూ బీజేపీ పాగా వేసింది. ప్రస్తుతం బీజేపీ దేశంలో మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారంలో ఉంది. ఇప్పటివరకు బీజేపీకి చిక్కని బెంగాల్ లో ఈ సారి మ్యాజిక్ చేస్తామని కమల నాథులు చెబుతున్నారు. గత ఎన్నికల ముందు తృణమూల్ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన సువేంధు అధికారికి పార్టీ పగ్గాలు అప్పగించిన బీజేపీ గెలుపు పక్కా అంటూ భీకర ప్రతిజ్ఞలు చేస్తోంది. దీంతో పశ్చిమబెంగాల్ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. పదిహేనేళ్ల క్రితం వామపక్షాల కోటను తృణమూల్ కూల్చినట్లే.. ఇప్పుడు దీదీ మమతాను గద్దె దించుతామని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పక్కా ప్లాన్ తో ముందుకు కదులుతున్నారు. వరుసగా మూడు దఫాలుగా అధికారంలో ఉన్న తృణమూల్ పై బెంగాల్ లో ప్రజా వ్యతిరేకత ఉందని బీజేపీ చెబుతోంది. సీఎం మమతా బెనర్జీ విధానాలు, ముస్లిం బుజ్జగింపు ధోరణులు, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ప్రజలు, హిందూ ఓటర్లను సంఘటితం చేయడంపై బీజేపీ ఫోకస్ చేసిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఇటీవల విడుదలైన ఓపీనియన్ పోల్స్ కూడా బీజేపీ నేతలను ఉత్సాహ పరుస్తోందని అంటున్నారు. గతంలో బీజేపీ సాధించిన 77 సీట్ల కంటే ఈ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని పలు సంస్థలు నిర్వహించిన సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయని చెబుతున్నారు. అయితే ఈ ఫలితాలు తృణమూల్ ను గద్దె దించే అంత స్థాయికి బీజేపీ ఇంకా చేరలేదని చెబుతున్నా, ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున ఈలోగా మ్యాజిక్ చేస్తామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది.



పక్కా వ్యూహంతో బెంగాల్ కోటను బద్దలు కట్టేలా ముందుకు కదులుతోందని అంటున్నారు. తృణమూల్ ఓటు బ్యాంకును చీల్చడం, బీజేపీ ఓటు బ్యాంకును పెంచడం అన్న లక్ష్యంతో కమల నాథులు వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు మత్స్యకారులు, రైతులను తన వైపు తిప్పుకునేలా తీర ప్రాంత ఓటు బ్యాంకును స్థిరపరుచుకోవడమే ఇందుకు కారణంగా చూపుతున్నారు. బీజేపీ నేత సువేంధు అధికారి కుటుంబానికి కోస్తా ప్రాంతమైన పర్బా మేదినపూర్ లో మంచి బలం ఉంది. 2021 ఎన్నికల్లో ఇక్కడ కేవలం 7 జిల్లాల్లో బీజేపీ గెలిస్తే, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో మెజార్టీ సాధించింది. దీనిని బట్టి బీజేపీ ఒక్కో జిల్లాలో తన ప్రాబల్యం పెంచుకునేలా పనిచేస్తోందని అంటున్నారు. ఝార్గ్రాం, బంకురా, పురూలియా జిల్లాలతో కూడిన గిరిజన బెల్ట్ తోపాటు ఉత్తర బెంగాల్ మైదాన ప్రాంతాల్లో బీజేపీ విస్తరిస్తోందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో 5 శాతం కంటే తక్కువ మార్జిన్ తో గెలిచిన 46 స్థానాలపై ఈ సారి ప్రత్యేక దృష్టి పెట్టారు.

# కూటమి వర్సెస్ వైసీపీ : పరాభవ పంచాంగం ఏమి చెప్పింది ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీల మధ్య రాజకీయ రచ్చ ఒక రేంజిలో సాగుతూనే ఉంటుంది. అది ఏ విషయం అయినా రెండు వైపులా పోటా పోటీగా ఉంటుంది. ఇదిలా ఉంటే కొత్త తెలుగు సంవత్సరాది వచ్చింది. దాని పేరు పరాభవ నామ సంవత్సరం. ఈ ఉగాది వేళ అధికార కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉగాది కార్యక్రమాలను నిర్వహించింది. అదే సమయంలో వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో ఉగాది కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రెండు చోట్లా పంచాంగ కర్తలు పఠనం చేశారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బ్రహ్మాండంగా ముందుకు సాగుతుందని పండితులు చెప్పారు. వైసీపీకి అన్నీ మంచి రోజులే అని తాడేపల్లి పంచాంగం చెప్పుకొచ్చింది.

**కూటమికి విజయం :**

విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలలో మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజయం సిద్ధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సంకల్పించిన ప్రతీదీ ఫలిస్తుందని స్పష్టం చేశారు. తెలుగు వారు ఏ రంగంలో ఉన్నా అగ్రస్థానంలో ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యంగా ప్రజాహితంతో ముందడుగులు వేస్తాయని వెల్లడించారు. లగ్నాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంటుందని. అందుకే ఉగాదికి ముందుగానే కురిసిన వర్షం దీనికి సూచిక అని తెలిపారు. ప్రత్యేకంగా ఈ ఏడాది సాంస్కృతిక చైతన్యం కలుగుతుందని వివరించారు. అమరావతి విశ్వనగరంగా ఎదుగుతుందని రాష్ట్రానికి ప్రభుత్వానికి ఆర్థిక ప్రగతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి విఘ్నాలు లేకుండా సుఖ శాంతులతో ఉంటారని వివరించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు అంతా ఆనందం వ్యక్తం చేశారు.

**వైసీపీ అనుకూల ఫలితాలు :**

ఇక తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉగాది ఉత్సవాలలో పంచాంగ శ్రవణం చేసిన భాస్కర సుబ్రమణ్య సిద్ధాంతి వైసీపీకి పరాభవ నామ సంవత్సరంలో అన్నీ మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది పార్టీకి మంచి పునాది పడుతుందని ఆయన చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నం చేసినా పెద్ద ఫలితాలే వస్తాయని జోస్యం చేప్పారు. పార్టీకి ఈ ఏడాది బలమైన పునాది పడుతుందని కూడా ఆయన వెల్లడించారు. దీంతో వైసీపీ నేతలలో జోష్ అయితే పెద్ద ఎత్తున కనిపిస్తుంది. మొత్తానికి పోటా పోటీగా జరిగిన కూటమి వర్సెస్ వైసీపీ పంచాంగాలు రెండు చోట్లా ఆనందం కలిగించే విధంగా జోస్యాలు వెలువడడం విశేషం.

# భారత ఇంధన భద్రతకు ముంచుకొస్తున్న ముప్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత ఆర్థిక వ్యవస్థకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇరాన్ , దాని ప్రత్యర్థి దేశాల మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు ఇప్పుడు ప్రపంచ ఇంధన సరఫరా కేంద్రాలపై పడ్డాయి. ముఖ్యంగా ఖతర్‌లోని రాస్ లఫన్ ఎల్ఎన్‌జీ కేంద్రం, సౌదీ అరేబియాలోని అరామ్‌కో రిఫైనరీలపై జరిగిన తాజా దాడులు భారత్‌కు పెను సవాలుగా మారనున్నాయి. ఈ పరిణామాలు భారత ఇంధన భద్రతను, పారిశ్రామిక వృద్ధికి ముప్పుగా చెప్పొచ్చు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కేవలం సరిహద్దు పోరాటాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి ఇంధన మౌలిక సదుపాయాలపైకి మళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ చేపట్టిన తాజా డ్రోన్ , క్షిపణి దాడులు ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వాయువు, చమురు ఉత్పత్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం భారత్‌ను ఆత్మరక్షణలో పడేసింది.

**ఖతర్ ఎల్ఎన్‌జీ సంక్షోభం: భారత్‌పై నేరుగా ప్రభావం**

భారతదేశం తన మొత్తం సహజ వాయువు అవసరాలలో సుమారు 50 శాతం విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం అంటే దాదాపు 40 శాతం ఒక్క ఖతర్ నుంచే వస్తుంది. తాజాగా ఖతర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ రాస్ లఫన్ ఎల్ఎన్‌జీ హబ్‌పై జరిగిన దాడి భారత గ్యాస్ సరఫరా గొలుసును ఛిన్నాభిన్నం చేసేలా ఉంది. రాస్ లఫన్ నుండి సరఫరా నిలిచిపోతే భారత్‌లోని గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లు, ఎరువుల తయారీ యూనిట్లు , సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ లభ్యత తగ్గడంతో ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. ఇది దిగుమతి వ్యయాన్ని పెంచి, దేశీయంగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

**అరామ్‌కోపై దాడి: చమురు మార్కెట్‌లో ప్రకంపనలు**

సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో రిఫైనరీపై జరిగిన దాడి ప్రపంచ చమురు మార్కెట్లను కుదిపేసింది. సౌదీ అరేబియా భారత్‌కు రెండో అతిపెద్ద చమురు సరఫరాదారు. అక్కడి ఉత్పత్తిలో ఏ చిన్న అంతరాయం కలిగినా అది భారత పెట్రోల్, డీజిల్ ధరలపై తక్షణ ప్రభావం చూపుతుంది. గతంలో కూడా అరామ్‌కోపై దాడులు జరిగినప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర ఒక్కసారిగా పెరిగిన ఉదంతాలు ఉన్నాయి.

**ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే కాకుండా మొత్తం ఆర్థిక వ్యవస్థపై గొలుసుకట్టు ప్రభావాన్ని చూపుతుంది. గ్యాస్ ధరలు పెరిగితే విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరిగి, సామాన్యులపై భారం పడుతుంది. ఎరువుల తయారీలో సహజ వాయువు ప్రధాన ముడిసరుకు. సరఫరా తగ్గితే ఎరువుల కొరత లేదా ధరల పెరుగుదల వల్ల రైతులకు కష్టాలు తప్పవు. స్టీల్, గ్లాస్, సిరామిక్ వంటి పరిశ్రమలు గ్యాస్‌పైనే ఆధారపడతాయి. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల భారత ఉత్పత్తుల పోటీతత్వం తగ్గుతుంది. ఇరాన్ ఈ దాడులను "సౌత్ పార్స్" గ్యాస్ ఫీల్డ్‌పై జరిగిన దాడులకు ప్రతిచర్యగా పేర్కొంటోంది. ఈ ప్రతీకార దాడుల పరంపర గల్ఫ్ ప్రాంతాన్ని అస్థిరతలోకి నెట్టివేస్తోంది.

**భారత్ ముందున్న మార్గాలు ఏమిటి?**

ప్రస్తుత సంక్షోభాన్ని తట్టుకోవడానికి భారత్ కేవలం నిరసనలతో సరిపెట్టకుండా ఆచరణాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కేవలం పశ్చిమాసియాపైనే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాల నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతులను పెంచుకోవాలి. దేశంలో ఉన్న భూగర్భ చమురు నిల్వలను అత్యవసర సమయాల కోసం సిద్ధంగా ఉంచుకోవాలి. సోలార్, విండ్ పవర్ వంటి రంగాల్లో పెట్టుబడులను వేగవంతం చేయడం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. పశ్చిమాసియా దేశాలతో చర్చలు జరిపి, సరఫరాలో అంతరాయం కలగకుండా దౌత్యపరమైన ఒత్తిడి తీసుకురావాలి.

పశ్చిమాసియాలో రేగిన ఈ చిచ్చు ప్రపంచ శాంతికే కాక, భారత ఆర్థిక సుస్థిరతకు కూడా సవాలుగా మారింది. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ కదలికలను బట్టి భారత్ తన ఇంధన వ్యూహాన్ని యుద్ధ ప్రాతిపదికన మార్చుకోవాల్సి ఉంటుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ప్రగతి గ్రామ సమైక్య మహిళా దినోత్సవ వేడుకలు.

- 500 మంది మహిళలతో ఘనంగా వేడుకలు.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి షాబిర్ పాషా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి.
- విశిష్ట అతిథులుగా వసుంధర షాపింగ్ మాల్ తాటిపల్లి శంకర్ బాబు దంపతులు.
- ఎస్ కే టి జ్యూవెలరీస్ దోసపాటి క్రాంతి.
- డాక్టర్ సాగరిక గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్

యు పి హెచ్ సి డాక్టర్ నేహా.

- డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ రూప.
- డాక్టర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు సెక్రటరీలకు ఘన సన్మానం.





**చుంచుపల్లి పెన్ పవర్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గౌతమ్ పూర్ ప్రగతి గ్రామ సమాఖ్య వివో పద్మ ఆధ్వర్యంలో వసుంధర షాపింగ్ మాల్ ఎంజీ రోడ్డు తాటిపల్లి శంకర్ బాబు ఎస్ కె టి జువెలరీస్ విద్యానగర్ దోసపాటి క్రాంతి కొత్తగూడెం వారి సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా సింగరేణి గౌతమ్ పూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు దంపతులు, ఎస్ కే టి జువెలరీస్ దోసపాటి క్రాంతి, మహిళా శిశు సంక్షేమ శాఖ డిస్టిక్ కోఆర్డినేటర్ రూప, డాక్టర్ సాగరిక, గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్ రామవరం పెనగడప పిహెచ్సి డాక్టర్ నేహా, గౌతమ్ పూర్ సర్పంచ్ కళ్యాణి, విద్యానగర్ సర్పంచ్ శాంతి శ్రీ, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్, రుద్రంపూర్ ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల సమానత్వం ఇంటి నుండే ప్రారంభం కావాలని నిరంతరం మహిళను గౌరవించాలని ఇంట్లో మగ పిల్లలను ఆడపిల్లలను సమానంగా చూడాలని వారన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా ఉపాధి రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని వారన్నారు. మాజీ చైర్పర్సన్ సీతా లక్ష్మీ మాట్లాడుతూ.. భర్త కాపు కృష్ణ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి రావడం జరిగిందని అంతకుముందు టీచర్గా పని చేశానని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పురుషులతో సమానంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్నారని అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యానిర్వహకులు వివోఏ పద్మ రత్నకుమార్ ని అభినందించిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ టిఆర్ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి.. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ చదివే మహిళ సాధికారతకు ప్రధాన ఆధారమని అమ్మాయిలు చదువు ఆ కుటుంబానికి వెలుగునిస్తుందని తల్లిదండ్రులు తమ కుమార్తెకు పూర్తి స్వేచ్ఛనిస్తూ మంచి విద్యను అందించాలని వారు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వారన్నారు. మహిళల కొరకు ఇందిరా శక్తి అనే కార్యక్రమాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్ని రంగాల్లో మహిళలు ఉండాలని ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పథకాలు మహిళా చేతుల్లోనూ ఉంటున్నాయని భర్త వంద రూపాయలు ఇవ్వు అనే పరిస్థితి వచ్చిందని మహిళా విజయమని అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డిస్టిక్ కో ఆర్డినేటర్ రూప మాట్లాడుతూ ఈ సంక్షేమ శాఖలో ట్రాన్స్జెండర్ మహిళలు బాలికలు అందరికీ అండగా ఉంటుందని ఎవరైనా మనకు కష్టం వస్తే 181 కి కాల్ చేయవచ్చు అని మీకు ఏ కష్టం వచ్చినా ముందుగా చెప్పుకోవాలని వారు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించిన ప్రగతి గ్రామ సమాఖ్య. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం వందమంది మహిళలను సన్మానించడం జరిగింది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ మహిళ సెక్రటరీలను శ్వేత మండల సమైక్య సీసీలు చుంచుపల్లి మండల వివో ఏల కు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించిన ప్రగతి గ్రామ సమైక్య. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లందరికీ శు భాకాంక్షలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమాఖ్య అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ఆర్గనైజర్ రత్నకుమార్. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ కమిటీ సభ్యులు ఉమా సుమ లావణ్య మల్లేశ్వరి మహిళ సాదరిక సభ్యులు అకౌంటెడ్ ప్రియాంక, సీసీ రాము, రమ, తిరుపతి, ఏపీఎం అబ్దుల్లా, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాములు, ఫీల్డ్ ఆఫీసర్ సిబ్బంది నిహారిక, శృతి, దేవి, స్టాఫ్ నర్స్ ఎస్తేర్, సిపిఐ మహిళా అధ్యక్షురాలు రత్నకుమారి, పంచాయితీల మహిళా సెక్రటరీలు జక్కంపూడి షర్మిల, వివో ఏలు స్వర్ణ రేఖ, రేష్మా, రోస్, రమ, జయ, జాల విజయ, కావ్య, మున్నీసా, స్వరూప, లక్ష్మి, యమునా, శ్రీలత, లావణ్య, సంకీర్తన, మహేశ్వరి, సరిత, అకౌంటెంట్ వింధ్య, ఎమ్మెస్ అధ్యక్షురాలు రాజకుమారి. అందర్నీ ఉత్తేజపరిచిన యాంకర్ స్నేహ. డిస్టిక్ కో ఆర్డినేటర్ మోరే రూప వేసిన డాన్స్ అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమం విజయవంతంలో కృషిచేసిన రిపోర్టర్లు రిషి, గోపి, కిరణ్, శ్రీనివాస్, మేకల జ్యోతి, ప్రోగ్రాం లైవ్ అందజేసిన సత్య డిజిటల్ బృందం కి కృతజ్ఞతలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమైక్య.

# రామకృష్ణాపురంలో వైభవంగా ఉగాది వేడుకలు.

- సాంప్రదాయ బద్ధంగా పూజలు, అభిషేకాలు.
- ఆకట్టుకున్న పంచాంగ శ్రవణం.





**కామేపల్లి పెన్ పవర్:**: కామేపల్లి మండలం రామకృష్ణాపురంలో సువర్చల సహిత శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువా రం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పుణ్యకాలంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శిం చుకుని ఆశీస్సులు పొందారు.సాయంత్రం ఆలయ అర్చకులు మద్దిపట్ల నరసింహ ఫణి చే నిర్వహించిన పంచాంగ శ్రవణం భక్తులను ఆకట్టుకుంది. రాబోయే సంవ త్సరానికి సంబంధించిన శుభాశుభ ఫలి తాలు, గ్రహస్థితులు, వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలను విశదీకరిస్తూ భక్తులకు సవివరంగా వివరణ ఇచ్చారు. పంచాంగ శ్రవణం ద్వారా నూతన సంవత్సరానికి మార్గదర్శకత్వం లభించిందని భక్తులు ఆనందంను వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆలయంలో జరగనున్న శ్రీ రామనవమి ఉత్సవాలు ఈ సంవత్సరం 50వ,వార్షికోత్సవంగా ఘనం గా నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ ఈ సందర్భంగా ప్రకటించింది. ఈ మహో త్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవస్థానం కమిటీ సభ్యు లు, భక్తులు పాల్గొన్నారు. వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి దేవస్థానం కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది.

# ఆ విషయంలో స్వార్థపరుడినే: సంజూ శాంసన్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్-2026 హీరో, టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇతరుల మెప్పు కోసం తాను ఎప్పుడూ ఏ పనీ చేయలేదని తెలిపాడు. ఎల్లప్పుడూ తన మనసు చెప్పినట్లే నడుచుకున్నానని.. ఈ విషయంలో తాను స్వార్థపరుడినే అన్నాడు.

**దాగుడుమూతల మాదిరి..**

భారత టీ20 జట్టు ఓపెనర్గా 2024 నుంచి రాణిస్తున్న సంజూ శాంసన్.. శుబ్‌మన్ గిల్ పునరాగమనంతో కొన్నాళు తుదిజట్టులో చోటు కోల్పోయాడు. ఆ తర్వాత గిల్ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చినా.. సరిగ్గా వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభానికి ముందే ఫామ్ కోల్పోయాడు. దీంతో ఓపెనర్, వికెట్ కీపర్‌గా సంజూ స్థానాన్ని ఇషాన్ కిషన్ భర్తీ చేశాడు.

**నాకౌట్ దశలో వరుసగా హాఫ్ సెంచరీలు**

అయితే, కీలక నాకౌట్ మ్యాచ్‌లలో యాజమాన్యం సంజూకు తిరిగి ఓపెనర్‌గా అవకాశం ఇవ్వగా దుమ్మురేపాడు. ముఖ్యంగా సెమీస్ చేరాలంటే వెస్టిండీస్‌తో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో 97 పరుగులతో అజేయంగా నిలిచాడు ఈ వికెట్ కీపర్ బ్యాటర్. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, న్యూజిలాండ్‌తో ఫైనల్లో 89 పరుగులతో సంజూ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ మూడు సందర్భాల్లోనూ అతడి సెంచరీ చేసే అవకాశం కోల్పోవడం గమనార్హం. ఏదేమైనా భారత్ టీ20 వరల్డ్‌కప్-2026 గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన సంజూ తనకు జట్టు ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని పేర్కొన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ డ్రెసింగ్ రూమ్‌లో ఎప్పుడూ దీని గురించే మాట్లాడేవారన్నాడు. ప్రతి ఒక్క ఆటగాడు జట్టు విజయం కోసమే శ్రమించాలని దిశా నిర్దేశం చేసేవారని పేర్కొన్నాడు.




**ఆ విషయంలో నేను స్వార్థపరుడినే**

"మా కోచ్ , కెప్టెన్ డ్రెసింగ్‌రూమ్‌లో కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. వ్యక్తిగత రికార్డుల కంటే కూడా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని.. అందుకు తగ్గట్లే ఆడాలని పదే పదే మాకు చెప్పేవారు. మా నాయకత్వ బృందం నిర్ణయానుసారమే మేమంతా నడుచుకున్నాము. నిజం చెప్పాలంటే ప్రతి ఒక్క ఆటగాడు అలాగే ఆలోచించాలి. నేనైతే నా మనసు చెప్పినట్లే జట్టు ప్రయోజనాల కోసం మాత్రమే ఆడేవాడిని. ఈ విషయంలో నేను స్వార్థపరుడినే. నా పట్ల నేను నిజాయితీగా ఉండటం ద్వారా నాలోని బలహీనతలు అధిగమించడం సులువైంది" అని సంజూ శాంసన్ చెప్పుకొచ్చాడు. కాగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం ఇటీవలే ఇదే విషయాన్ని నొక్కి వక్కాణించిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ సారథ్యంలో 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో అనుభవం ఉందని.. అయితే, తమ జట్టులో యువకులు ఉన్నా జట్టు ప్రయోజనాలకే పెద్దపీట వేశారని అన్నాడు. తద్వారా టీమిండియా మరోసారి వరల్డ్‌కప్ ట్రోఫీ గెలిచిందని పేర్కొన్నాడు.

## మార్చి 24న సాయి పేరెంటరల్ ఐపిఒ




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ సాయి పేరెంటరల్ వచ్చే వారం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సెబీకి సమర్పించగా అనుమతులు జారీ అయ్యాయి. మార్చి 24న ఇష్యూ ప్రారంభం కానుందని ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.409 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.285 కోట్ల విలువైన కొత్త షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద 31.57 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. షేర్ల ధరల శ్రేణీని రూ.372-392గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ తమ వృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎస్‌పిఎల్ సిఎండి అనిల్ కె?కె తెలిపారు. ఐపిఒ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఫార్ములేషన్ బిజినెస్‌ను బలోపేతం చేయడానికి, అలాగే ఇంజెక్టబుల్, ఓరల్ సాలిడ్ డోసేజ్ విభాగాల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సిడిఎంఒ) సామర్థ్యాలను విస్తరించడానికి వెచ్చించనున్నట్లు వెల్లడించారు.

## కామేపల్లిలో భగత్ సింగ్ 95వ, వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ.




**కామేపల్లి మార్చి 19 పెన్ పవర్:** కామేపల్లి మండల కేంద్రంలో విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 95వ, వర్ధంతి సభల వాల్ పోస్టర్లను పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.రాకేష్ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 23 నుండి 30 వరకు పి వై ఎల్, పిడిఎస్ యు తెలంగాణ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన అమరవీరుల వర్ధంతి ఉత్సవాల పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్ వి రాకేష్ మాట్లాడుతూ.. దేశ స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలను గెలిపించడమే నేటి యువత ముందున్న ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని రగిలిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలని, అలాగే ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే 'నూతన జాతీయ విద్యా విధానం - 2020'ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో చదువుకున్న 25 కోట్ల మంది నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారం రోజుల పాటు జరిగే ఈ పోరాట సభల్లో కామేపల్లి మండలంలోని విద్యార్థులు, యువత, మేధావులు, సామాజిక విప్లవకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాకేష్ పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణలో యువకులు నరేష్, మురళి, గోవర్ధన్, భూపతి, కళ్యాణ, అఖిల్, చరణ్ పాల్గొన్నారు.

# అనుమానం పెనుభూతం అక్కను కడతేర్చిన తమ్ముడు

**రంగారెడ్డి :పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో దారుణం జరిగింది. అక్క చెడు తిరుగుళు తిరుగుతుందనే అనుమానంతో తమ్ముడు అక్కని చంపి ముక్కలు చేసి చెరువులో పడవేసిన ఘటన బయటపడింది. కొన్నాళ్ల క్రితం బావ చనిపోయిన తర్వాత అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో తమ్ముడు పు రామ్ ఆమెను రెండు భాగాలుగా చేసి మజీత్ పూర్ చెరువులో పడేసాడు. గత నెల 28 నాడు బాటసింగారం కిరణం షాపు నుండి తప్పిపోయిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో హత్య వ్యవహారం బయటపడింది.

# రహదారిని కబ్జా చేసారు రోడ్డెక్కిన శంషీగూడ స్థానికులు

**కూకట్ పల్లి : పెన్ పవర్:** ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శాంషీ గూడ చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. ప్రగతి నగర్ లోని ప్రణీత్ ఆంటీలియా తరహాలో శంషీగూడలో శిల్పా బృందావనం, సాయి హిల్స్ వాసులు కూడా రహదారిని కబ్జా చేసి గేట్లను ఏర్పాటు చేసి ఎవరిని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం ప్రజలు రోడ్డెక్కారు. శనివారం,ఆదివారాలు వస్తే శాంషీ గూడ నుండి ఎల్లమ్మబండ కు వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. శిల్ప బృందావన్ నివాసాలు అన్ని హెచ్ఎండిఏ లేఔట్ తో ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ అంటూ రహదారిని మూసివేసారని అన్నారు. అదేవిధంగా సాయి హిల్స్ వాసులు కూడా రోడ్డు పై గోడ నిర్మాణం చేపట్టడం పైన ఇప్పటికే డిప్యూటీ కమిషనర్లకు ఉన్న అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. తమకు స్పీకింగ్ ఆర్డర్లలో తోపాటు వీటిని తొలగించాలని ఆదేశాలు ఉన్న ఎవరూ పట్టించుకోకపోవడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను సైతం ఆశ్రయించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటి పైన విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా మియాపూర్ నుండి వచ్చేవారు నేరుగా గాజులరామారం వెళ్లేందుకు వీలు ఉంటుంది అని తెలిపారు.

## పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ పంజా

**లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ రిచర్డ్ సైమన్**

**కార్యాలయంలో రికార్డుల క్షుణ్ణంగా పరిశీలన.**

**వికారాబాద్ : పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ంఅః) అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఒక వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసిన ఘటనలో పెద్దేముల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రిచర్డ్ సైమన్ అధికారులకు చిక్కారు.గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన మోటేషన్ ఫైల్ (ఓబీబిజీబితినీని ఈతిశ్రీవ) ప్రక్రియ పూర్తి చేయించుకోవడానికి ఆర్ఐ రిచర్డ్ సైమన్‌ను సంప్రదించారు. ఇందుకు గాను ఆర్ఐ రూ. 15,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ రంగారెడ్డి రేంజ్ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండగా రిచర్డ్ సైమన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ ఘటన నేపథ్యంలో పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయంలోని పలు కీలక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ధరణికి సంబంధించిన వ్యవహారాలు, ఇతర అవకతవకలపై ఆరా తీస్తున్నారు.

## నడి రోడ్డుపై పసికందు మృతదేహం కలకలం

**ఆదిలాబాద్ :పెన్ పవర్:** గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన మగ పసికందు మృతదేహం లభ్యమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పసికందును ఎవరైనా కావాలనే వదిలేశారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# తమిళనాడు ఎన్నికల బిజెపి ఎస్సీ మోర్చా కో-ఇంచార్జ్ గా 'ఎస్. కుమార్' నియామకం

**హైదరాబాద్ : పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న 'శ్రీ ఎస్. కుమార్' గారికి పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని, ఆ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎన్నికల సహ-ప్రభారీ (కో-ఇంచార్జ్) గా ఆయనను నియమిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళం రాష్ట్రాలకు కూడా ఎస్సీ మోర్చా తరపున ప్రభారీలను, సహ-ప్రభారీలను నియమించారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి ప్రభారీగా శ్రీ శంభునాథ్ తుండియా గారిని, సహ-ప్రభారీలుగా ఎస్. కుమార్ ని మరియు ఎస్. మునిస్వామి (మాజీ ఎంపీ) గారిని నియమించారు.ఎస్. కుమార్ గత కొంతకాలంగా ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన పార్టీ నాయకత్వం, తమిళనాడు ఎన్నికల్లో ఓటర్లను సమన్వయం చేసుకుంటూ, పార్టీ విజయానికి వ్యూహరచన చేసేందుకు ఈ కీలక బాధ్యతను కట్టబెట్టింది.

# సైబర్ దాడిలో మీ సొమ్ము పోతే.. ఇది చేస్తే తిరిగి వస్తుంది.. ఆర్బీఐ సంచలన నిర్ణయం..



కష్టపడి దాచుకున్న సొమ్మును ఎవరో గుర్తు తెలియని వ్యక్తికి ఒక్క క్లిక్‌తో సమర్పించుకోవడం అంటే ఆ బాధ వర్ణనాతీతం. ఫోన్ రాగానే కంగారు పడిపోయి, ఎదుటి వ్యక్తి అడిగిన ఓటీపీనో లేదా పిన్‌నో చెప్పేసి నిలువునా మోసపోతున్న బాధితులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) ఒక తీపి కబురు అందించబోతోంది. ఇప్పటి వరకు సైబర్ నేరాల్లో పోయిన డబ్బు తిరిగి రావడం అనేది ఒక కలగానే మిగిలిపోగా, ఇప్పుడు ఆర్బీఐ ప్రవేశపెట్టబోతున్న ఈ కొత్త ముసాయిదా బాధితులకు ఒక కొండంత అండగా నిలవనుంది. అయితే, ఈ పరిహారం అందరికీ రాదు, దీనికోసం కొన్ని కఠినమైన నిబంధనలు ఉన్నాయి. అసలు ఆ 'పాక్షిక పరిహారం' పొందే మార్గం ఏంటి? ప్రభుత్వం ఎంత వాటా భరిస్తుంది? అనే ఆసక్తికరమైన వివరాల్లోకి వెళ్తే..

**బాధితులకు ఆర్బీఐ అభయం**

డిజిటల్ మోసాల బారిన పడి పిన్ నంబర్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీ వంటి కీలక సమాచారాన్ని తెలియక పంచుకున్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. సైబర్ నేరగాళ్లు పంపే మోసపూరిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని మోసపోయిన వారు కూడా ఈ పరిహారానికి అర్హులే. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, మోసపోయిన 5 పని దినాలలోపు సంబంధిత బ్యాంక్‌కు లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ (1930)కు తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలి. ఆలస్యంగా ఫిర్యాదు చేస్తే ఈ పరిహారం పొందే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది.

**జీవితంలో ఒక్కసారే**

ఆర్బీఐ ప్రతిపాదించిన ఈ ముసాయిదా ప్రకారం.. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే ఈ పాక్షిక పరిహారాన్ని పొందేందుకు అర్హుడు. ఒకవేళ మీరు రూ. 50 వేల వరకు సైబర్ నేరాల్లో నష్టపోతే, అందులో గరిష్టంగా 85 శాతం లేదా రూ. 25 వేలు (ఏది తక్కువైతే అది) పరిహారంగా అందుతుంది. ఉదాహరణకు, మీరు రూ. 25 వేల పరిహారానికి అర్హులైతే, అందులో సింహభాగం (రూ. 19,118) ఆర్బీఐ భరిస్తుంది, మిగిలిన మొత్తాన్ని సంబంధిత బ్యాంకులు చెల్లిస్తాయి. ఇది బాధితులకు పూర్తి ఉపశమనం కాకపోయినా, కొంత వరకు ఆర్థిక వెసులుబాటును కలిగిస్తుంది.

**నమ్మించే సైబర్ మాయాజాలం!**

చాలా బ్యాంకులు తమ ఖాతాదారుల సమాచారాన్ని థర్డ్ పార్టీ స్టోరేజ్ సంస్థలకు అప్పగిస్తుంటాయి. అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగుల కక్కుర్తి వల్ల ఈ డేటా సైబర్ దొంగల చేతుల్లోకి వెళ్తుంది. మీ బ్యాంక్ బ్యాలెన్స్, అడ్రస్ వంటి వివరాలను ఫోన్లో చెప్పడంతో, బాధితులు వారిని నిజమైన బ్యాంక్ అధికారులుగా నమ్మేసి మోసపోతున్నారు. ఈ విధంగా దొంగలించబడిన సమాచారమే ఇప్పుడు సైబర్ నేరాలకు ప్రధాన వనరుగా మారుతోంది. అందుకే అపరిచితులకు ఫోన్ లో బ్యాంక్ వివరాలు చెప్పవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**గణాంకాల వెనుక అసలు నిజం!**

దేశంలో డిజిటల్ చెల్లింపులు పెరగడంతో పాటు సైబర్ నేరాలు కూడా భారీగా పెరిగాయి. 2023లో రూ. 277 కోట్లుగా ఉన్న సైబర్ మోసాల మొత్తం, 2024 నాటికి ఏకంగా రూ. 1,457 కోట్లకు చేరింది. అయితే 2025లో ఈ సంఖ్య రూ. 520 కోట్లుగా నమోదైనట్లు తెలుస్తోంది. తక్కువ మొత్తాలు నష్టపోయిన వారి ఫిర్యాదులను పోలీసులు స్వీకరించకపోవడం వల్లే ఈ అధికారిక గణాంకాలు తక్కువగా కనిపిస్తున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. వాస్తవానికి బాధితులు కోల్పోతున్న సొమ్ము ఈ లెక్కల కంటే ఎంతో ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆర్బీఐ తీసుకువస్తున్న ఈ పరిహార పథకం బాధితులకు ఒక మంచి ఊరటనిచ్చే అంశమే. అయితే, పరిహారం వస్తుంది కదా అని నిర్లక్ష్యంగా ఉండకూడదు. సైబర్ నేరగాళ్లు నిరంతరం కొత్త దారులను వెతుకుతూనే ఉంటారు. మీ పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పకపోవడమే మీ సొమ్ముకు అసలైన రక్షణ. ఒకవేళ పొరపాటున మోసపోయినా, వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేసి మీ హక్కును కాపాడుకోండి. డిజిటల్ యుగంలో ఆర్థిక క్రమశిక్షణతో పాటు సైబర్ అవగాహన కూడా ప్రతి ఒక్కరికీ ప్రాథమిక అవసరం.

## ఉగాది రోజున స్టాక్ మార్కెట్ మహా పతనం : కర్పూరంలా కరిగిన 12 లక్షల కోట్లు..!



భారత స్టాక్ మార్కెట్లు కరోనా తర్వాత మరోసారి భారీగా పతనం కొనసాగిస్తున్నాయి. ఉదయం ఓపెన్ అయిన కొద్ది నిమిషాల్లోనే ఊహించని నష్టాల్లోకి జారుకున్న సూచీలు మధ్యాహ్నం ట్రేడింగ్ సెషన్లో నష్టాలను మరింతగా పెంచుకున్నాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి వస్తున్న ప్రతికూల సూచీలతో ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.12 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ లిస్టెడ్ స్టాక్స్ విలువ ఈ క్రమంలో 2 శాతం తగ్గింది. నేడు ప్రధానంగా ఆటో, బ్యాంకింగ్ స్టాక్స్ క్రాష్ కావటం సూచీలను తలకిందులు చేసేసింది.మధ్యాహ్నం 2.38 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 2300 పాయింట్ల నష్టంతో ట్రేడవుతుండగా.. నిఫ్టీ సూచీ 666 పాయింట్లు కోల్పోయింది. ఇక బ్యాంక్ నిఫ్టీ సూచీ 1647 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 1692 పాయింట్లు నష్టపోయాయి. దీంతో వరుసగా మూడు రోజులుగా లాభాల్లో కొనసాగుతున్న మార్కెట్లు ఉగాది పండుగ రోజున ఇన్వెస్టర్లకు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. ఆటో, రియల్టీ, మెటల్ రంగాలకు చెందిన షేర్లలో జోరుగా అమ్మకాలు కొనసాగుతుండటం సూచీలపై ఒత్తిడి పెంచేస్తోంది.ఈ రోజు మార్కెట్లలో హెవీ వెయిట్ బ్యాంకింగ్ స్టాక్ హెచ్డీఎఫ్సీ బ్యాంక్ షేర్ల అనూహ్య పతనం కూడా మార్కెట్ల నష్టాలను పెంచేయటంలో భాగమైంది. దీనికి తోడు జొమాటో, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ షేర్లు కూడా భారీగా మార్కెట్లను నష్టాల్లోకి లాగటానికి కారణంగా మారాయి. అయితే ఓఎన్జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోల్ ఇండియా కంపెనీల షేర్లు మాత్రం లాభాలతో ముందుకు సాగుతున్నాయి. మార్కెట్లో మట్నత్తంగా లిస్టెడ్ షేర్లలో 885 లాభపడగా.. 2549 నష్టాల్లో కొనసాగుతున్నాయి. కేవలం 146 షేర్లు మాత్రం ఎలాంటి మార్పు లేకుండా ముందుకెళుతున్నాయి. ప్రధానంగా అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే కొనసాగటం, క్రూడ్ ఆయిల్ బ్యారెల్ 113 డాలర్లకు చేరుకోవటం ఇన్వెస్టర్లను వణికిస్తున్నాయి. ఇదే క్రమంలో ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల్లో గ్యాస్ ప్లాంట్లు దెబ్బతినటం సప్లై సమస్యలను సృష్టిస్తుందనే ఆందోళనలు గ్లోబల్ మార్కెట్లతో పాటు దేశీయ మార్కెట్లను హారతి కర్పూరం లాగా ఆవిరి చేస్తున్నాయి. ఆయిల్ అండ్ గ్యాస్ దిగుమతులపై ఆధారపడే ఇండియా లాంటి దేశాల్లో ఈ పరిస్థితులు ద్రవ్యోల్బణాన్ని పెంచటంతో పాటు రానున్న రోజుల్లో ఆర్థిక వ్యవస్థ వృద్ధిని దెబ్బతీస్తాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేయటం మార్కెట్లలో సెంటిమెంట్లను దెబ్బతీస్తున్నాయి. ఇదే పరిస్థితులు యూరోపియన్ స్టాక్ మార్కెట్లు కూడా కనిష్టాలకు పతనం అయ్యాయి.

# దుబాయ్ హబ్‌కు ఆపిల్ గుడ్ బై కొత్త రూట్లలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ల తరలింపు..




పశ్చిమాసియాలో రాజుకున్న యుద్ధం ప్రపంచ టెక్ దిగ్గజం ఆపిల్ వ్యూహాలను పూర్తిగా మార్చేస్తోంది. ఇజ్రాయెల్ – ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల మీదుగా సాగే వాణిజ్య మార్గాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనివల్ల భారత్ నుంచి ఎగుమతయ్యే ఐఫోన్ల సరఫరాకు దుబాయ్ కీలక ట్రాన్సిట్ హబ్‌గా ఉండేది. అయితే ప్రస్తుత ఉద్రిక్తతల దృష్ట్యా ఆపిల్ తన గ్లోబల్ సప్లై చైన్ రూటును మార్చేస్తూ.. దుబాయ్‌ను పక్కన పెట్టి ప్రత్యామ్నాయ మార్గాల వైపు మొగ్గు చూపుతోంది.

భారత్ నుంచి ఐఫోన్ల ఎగుమతుల్లో దుబాయ్ పాత్ర చాలా కీలకం. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారత్ నుంచి యూఏఈకి దాదాపు 4.2 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయి. అంటే మన కరెన్సీలో సుమారు రూ.37వేల 800 కోట్లు వాటి విలువ. ఇందులో కేవలం ఐఫోన్ల వాటానే 3.6 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.32వేల 400 కోట్లు. శాంసంగ్ ఫోన్లు మరో రూ.4వేల 500 కోట్ల వరకు ఉన్నాయి. భారత్ నుంచి జరిగే మొత్తం మొబైల్ ఎగుమతుల్లో 14 శాతం వాటా ఈ ప్రాంతానిదే. కానీ యుద్ధం వల్ల విమాన మార్గాల్లో ఆంక్షలతో పాటుగా పెరుగుతున్న ఇంధన ధరలు ఆపిల్‌ను పునరాలోచనలో పడేశాయి.

ఈ మార్పు ప్రభావం కేవలం ఆపిల్‌పైనే కాకుండా.. భారత్‌లోని ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, డిక్సన్ టెక్నాలజీస్ వంటి తయారీ సంస్థలపై కూడా పడుతోంది. ఎయిర్ కార్గో ఆపరేటర్లు ఇప్పటికే తమ రూట్లను మార్చేశారు. దుబాయ్ మీదుగా కాకుండా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా మీదుగా సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో విమాన ఇంధన ఖర్చులు, ఇన్సూరెన్స్ ఛార్జీలు భారీగా పెరుగుతున్నాయి. ఒక్కో ఫ్లైట్‌కు వేల డాలర్ల అదనపు భారం పడుతోంది. ఈ అదనపు ఖర్చుల వల్ల స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థల లాభాల మార్జిన్‌పై ఒత్తిడి పెరుగుతోంది.యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే గల్ఫ్ దేశాల్లో వినియోగం కూడా తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఆపిల్ ఇప్పుడు అమెరికా, బ్రిటన్, జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలకు నేరుగా ఎగుమతులు పెంచేందుకు సిద్ధమవుతోంది. అయితే ఇన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ భారత్‌లో ఐఫోన్ల తయారీ వేగం తగ్గడం లేదు. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా అమ్ముడయ్యే ప్రతి నాలుగు ఐఫోన్లలో ఒకటి భారత్‌లోనే తయారవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యుద్ధం తెచ్చిన ఈ సవాళ్లను అధిగమిస్తూ ఆపిల్ తన మేడ్ ఇన్ ఇండియా ప్రయాణాన్ని కొత్త మార్గంలో కొనసాగిస్తోంది.

## అప్పు చేసి ఎంజాయ్ చెయ్.. కట్టే సంగతి తర్వాత చూద్దాం: భారతీయుల కొత్త స్పెండింగ్ ట్రెండ్



: భారతీయ మధ్యతరగతి కుటుంబాల్లో ఒకప్పుడు పొదుపు అనేది ఒక సంస్కృతిగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి తలకిందులైంది. ఒకప్పుడు రూపాయి సంపాదిస్తే.. అర్ధ రూపాయి దాచుకునే భారతీయులు.. ఇప్పుడు సంపాదన కంటే ముందే ఖర్చు చేయడం అలవాటుగా చేసుకుంటున్నారు. ఈ విచ్చలవిడి ఖర్చుల వెనుక ఉన్న అసలు కారణాలు.. డిజిటల్ అప్పుల ఉచ్చు దానివల్ల కలిగే రిస్కులను వివరిస్తూ సాగే నేటి తరం ఆర్థిక ప్రయాణం గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

తరతరాలుగా భారతీయులకు సంపాదన, పొదుపు.. ఆ తర్వాతే ఖర్చు అనే సూత్రం వెన్నెముకగా ఉండేది. అప్పు అంటే భయం, సమాజంలో తక్కువ చేసి చూస్తారనే భావన ఉండేది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. ముఖ్యంగా యువతలో 'ముందు ఖర్చు చేసెయ్.. తర్వాత చూద్దాం' అనే ధోరణి పెరిగింది. 2016లో దేశ జీడీపీలో గృహ రుణాలు 31% ఉండగా, 2023 నాటికి అది 42.6%కి చేరింది. అదే సమయంలో పొదుపు మాత్రం దశాబ్దాల కనిష్ట స్థాయికి పడిపోవడం ఆందోళనకరం. పర్సనల్ లోన్లు, క్రెడిట్ కార్డుల వినియోగం గత 10 ఏళ్లలో రెట్టింపు అవ్వడమే దీనికి నిదర్శనం.

**ఫిన్‌టెక్ మాయాజాలం..**

ఈ మార్పు వెనుక టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో అప్పు కావాలంటే బ్యాంకుల చుట్టూ తిరగాలి, అనేక డాక్యుమెంట్లు సమర్పించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు మొబైల్ ఫోన్‌లో ఒక్క క్లిక్‌తో లోన్ మంజూరవుతోంది. బై నౌ పే లేటర్, నో-కాస్ట్ ఈఎంఐ వంటి ఆకర్షణీయమైన స్కీమ్స్ కొనుగోలుదారులను ఊరిస్తున్నాయి. అప్పు తీసుకోవడం అనేది ఒక బాధ్యతగా కాకుండా, కేవలం యూపీఐ పేమెంట్ చేసినంత సులభంగా మారిపోయింది. ముఖ్యంగా 18-30 ఏళ్ల యువత ఈ ఆకర్షణలో చిక్కుకుని, అవసరం లేకున్నా లగ్జరీల కోసం అప్పులు చేస్తున్నారు.

**ఈఎంఐల వలయంలో మధ్యతరగతి..**

నేడు మధ్యతరగతి భారతీయుడు 'ఎకో-నెమీ' అనే కొత్త సంక్షోభంలో ఉన్నాడు. అంటే ఆస్తుల కోసం కాకుండా, నిత్యావసరాలు, స్కూల్ ఫీజులు, మెడికల్ బిల్లుల కోసం కూడా ఈఎంఐలపై ఆధారపడుతున్నాడు. ఒక సర్వే ప్రకారం.. అప్పుల ఊబిలో ఉన్నవారిలో 85 శాతం మంది తమ నెలసరి ఆదాయంలో 40% కంటే ఎక్కువ కేవలం ఈఎంఐలకే కడుతున్నారు. జీతంలో సగానికి పైగా అప్పులకే పోతుండటంతో, ఏదైనా అనుకోని అనారోగ్యం లేదా ఉద్యోగ గండం వస్తే మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్యే కాదు, తీవ్రమైన మానసిక ఒత్తిడికి, నిద్రలేమికి దారితీస్తోంది.

ఈ ప్రమాదకర ధోరణిని అరికట్టాలంటే కేవలం అవగాహన సరిపోదు, వ్యవస్థలో మార్పు రావాలి. అప్పు ఇచ్చే యాప్‌లు కేవలం లాభాల కోసం కాకుండా.. సదరు వ్యక్తి తిరిగి కట్టగలడా లేదా అనే అంశాన్ని ఏఐ ద్వారా కచ్చితంగా అంచనా వేయాలి. ఆదాయంలో 40% దాటి లోన్లు ఇవ్వకుండా కఠిన నియమాలు ఉండాలి. అలాగే అప్పు తీసుకున్న తర్వాత నిర్ణయం మార్చుకుంటే.. 72 గంటల్లోపు ఎటువంటి పెనాల్టీ లేకుండా ఆ డబ్బును వెనక్కి ఇచ్చే కూలింగ్ ఆఫ్ పీరియడ్ ఉండాలి. రికవరీ ఏజెంట్ల వేధింపులు లేకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించే వ్యవస్థను ఆర్‌బీఐ బలోపేతం చేయాలి.

ఆర్థిక క్రమశిక్షణే మనిషికి నిజమైన గౌరవం. డిజిటల్ యుగంలో అప్పు సులభంగా దొరుకుతున్నప్పటికీ, అది మన భవిష్యత్తును తాకట్టు పెట్టకూడదు. అప్పును అవకాశంగా వాడుకోవాలి. కానీ.. అది మన జీవితాన్ని శాసించే స్థాయికి వెళ్లనివ్వకూడదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఉగాదితో స్టార్ట్ అయ్యే కొత్త ఏడాదిలో అయినా ప్రజలు తమ ఆర్థిక క్రమశిక్షణ, ఖర్చులపై ఫోకస్ పెట్టి అనవసరపు ఖర్చుల జోలికి వెళ్లకపోవటం మంచిదని వారు చెబుతున్నారు.

## ఉగాది రోజు ఇన్వెస్టర్లకు నష్టాల రక్త కన్నీరు.. మార్కెట్లను కుప్పకూల్చిన 6 కారణాలు ఇవే..



భారత స్టాక్ మార్కెట్లు ఉగాది ట్రేడింగ్ రోజున ఇన్వెస్టర్లకు అస్సలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిమిషం నిమిషానికీ నష్టాలు పెరిపోవటం ఆందోళనలు పెంచేస్తోంది. మార్కెట్ల ముగింపునకు ముందు 3 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 2700 పాయింట్ల మేర పతనం అయ్యింది. నిఫ్టీ కూడా 820 పాయింట్లకు పైగా పడిపోయింది. మిగిలిన బ్యాంక్, మిడ్ క్యాప్ సూచీలు కూడా 19వందల పాయింట్ల వరకూ కుప్పకూలాయి. అయితే మార్కెట్లను ఇంతగా పతనానికి దారితీయించిన కీలక కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**1. మండిపోతున్న ముడిచమురు ధరలు:**

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక్కసారిగా 8 శాతం పెరిగి బ్యారెల్‌కు 117 డాలర్లకు చేరింది. భారతదేశం తన అవసరాల కోసం చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. చమురు ధరలు 110 డాలర్ల పైన ఇలాగే కొనసాగితే.. అది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణమవుతుంది.

**2. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు:**

ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు బుధవారం భారీ పతనంతో ముగిశాయి. దీని ప్రభావంతో ఆసియా మార్కెట్లయిన జపాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు కూడా భారీగా నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి వస్తున్న ఈ నెగటివ్ సెంటిమెంట్ భారత ఇన్వెస్టర్లను అమ్మకాల వైపు నడిపించింది.

**3. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు:**

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారత మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. బుధవారం ఒక్కరోజే వీరు రూ.2వేల 714.35 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పుడు విదేశీ ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోకుండా తమ నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్ స్థిరత్వాన్ని దెబ్బతీసింది.

**4. పెరిగిన మార్కెట్ భయం - ఇండియా విక్స్:**

మార్కెట్‌లో భయాన్ని కొలిచే ఇండియా విక్స్ ఏకంగా 24 శాతం పెరిగి 23.13 స్థాయికి చేరింది. విక్స్ పెరగడం అంటే సమీప భవిష్యత్తులో మార్కెట్ తీవ్రమైన హెచ్చుతగ్గులకు గురవుతుందని అర్థం. ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆందోళనను ఇది స్పష్టంగా చూపుతోంది.

**5. అమెరికా ఫెడ్ కఠిన వైఖరి:**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచినప్పటికీ.. భవిష్యత్తులో రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చని సంకేతాలిచ్చింది. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉందని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ పేర్కొన్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గకపోతే, విదేశీ పెట్టుబడిదారులకు భారత్ వంటి ఎమర్జింగ్ మార్కెట్ల కంటే అమెరికా బాండ్లే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

**6. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ క్రాష్:**

భారత మార్కెట్లలో అత్యంత కీలకమైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 9 శాతం మేర కుప్పకూలడం మార్కెట్‌ను భారీగా దెబ్బతీసింది. గత రెండేళ్లలో ఇదే అతిపెద్ద ఇంట్రాడే పతనం. బ్యాంక్ చైర్మన్ అటాను చక్రవర్తి రాజీనామా చేయడంతో బ్యాంక్ మేనేజ్‌మెంట్‌పై ఇన్వెస్టర్లలో అనుమానాలు తలెత్తాయి. ఇది బ్యాంక్ నిఫ్టీ సూచీని 3 శాతం మేర కిందకు లాగేసింది.

## మెంతులు.. లాభాలు మాత్రం బోలెడు



మెంతులు అనేక ఔషధ గుణాలు కలిగిన దివ్యౌషధం. ఇవి మధుమేహ నియంత్రణ, మలబద్ధకం నివారణ, కీళ్ల నొప్పుల ఉపశమనానికి తోడ్పడతాయి. జలుబు, శరీర ఉష్ణోగ్రత, కొలెస్ట్రాల్ నియంత్రణలోనూ, కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యానికి మెంతులు ఎంతగానో సహాయపడతాయి. ప్రసవించిన తల్లుల్లో పాల ఉత్పత్తిని పెంచడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. మనం నిత్యం వంటల్లో రుచి, సువాసన కోసం ఉపయోగించే మెంతులు కేవలం వంట దినుసులే కాకుండా ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. అల్లం, వెల్లుల్లి, యాలకులు, లవంగాలు, కరివేపాకు, పుదీనా, కొత్తిమీర వంటి ఇతర సుగంధ ద్రవ్యాల మాదిరిగానే మెంతులు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పచ్చి చేపల కూరలలో సువాసన కోసం, నిల్వ పచ్చళ్లలో చలదనం కోసం వాడే ఈ మెంతులలో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. చిన్నగా కనిపించే ఈ గింజల్లో శరీరానికి మేలు చేసే ఎన్నో లాభాలు ఉన్నాయి. మెంతుల గింజల్లో ఫైబర్, ప్రోటీన్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, విటమిన్ ః6 పుష్కలంగా ఉన్నాయి. అలాగే, వీటిలోని ఫైటోకెమికల్స్ అనే సహజ పదార్థాలు వల్ల శరీరంలో ఉన్న హానికరమైన టాక్సిన్లను బయటకు పంపడంలో ఇవి సహకరిస్తాయి.మెంతులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చు. నానబెట్టిన మెంతులను తినడం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచవచ్చు. మలబద్ధకం సమస్యతో బాధపడే వారికి మెంతులు మంచి పరిష్కారం. దీనిద్వారా జీర్ణక్రియ మరింత మెరుగుపడుతుంది. జలుబు లేదా ఒంటి నొప్పులు ఉన్నప్పుడు గోరువెచ్చని నీటిలో మెంతులు కలిపి తాగితే ఉపశమనం లభిస్తుంది. మెంతులు శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి. బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచడంలో మెంతులు ఎంతగానో తోడ్పడతాయి. మెంతులు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల చెడు కొలెస్ట్రాల్ (ఒఆఅ) ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ (ఊఆఅ) ను పెంచడంలో సహాయపడతాయి. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు తమ ఆహారంలో మెంతులను చేర్చడం ద్వారా దీర్ఘకాలిక లాభాలను పొందవచ్చు.నిత్యం మెంతులు తీసుకోవడం వలన కీళ్ల నొప్పులు తగ్గుతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యానికి ఇవి చాలా అవసరం. నెలసరి సమయంలో వచ్చే కడుపు నొప్పికి గోరువెచ్చని నీటిలో మెంతులు తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా, మెంతులు కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన మెంతులను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ఎంతో మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మెంతులను ఆహార పదార్థాల్లో ఉపయోగించడంతోపాటు.. మెంతులను నీటిలో నానబెట్టి తీసుకోవచ్చు..

## 15 రోజులు వెల్లుల్లిని ఇలా తింటే
# శరీరంలో వచ్చే మార్పులు



వెల్లుల్లి మన భారతీయ వంటకాల్లో ఒక ముఖ్యమైన పదార్థం. కేవలం రుచిని పెంచడమే కాకుండా, ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేదం చెబుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను సరైన పద్ధతిలో తీసుకుంటే, శరీరంపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. మన ఇళ్లల్లో సాధారణంగా లభించే వెల్లుల్లి కేవలం వంటకు రుచిని అందించే పదార్థం మాత్రమే కాదు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఒక అద్భుత ఔషధం. ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను తీసుకోవడం ద్వారా మీ ఆరోగ్యంలో అద్భుతమైన మార్పులను గమనించవచ్చు. ఆయుర్వేదం ప్రకారం, వెల్లుల్లి అనేక అనారోగ్య సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిని దంచినప్పుడు లేదా చిన్న ముక్కలుగా కట్ చేసినప్పుడు, దాని నుండి అలసిన్ అనే శక్తివంతమైన కాంపౌండ్ విడుదల అవుతుంది. ఈ అలసిన్ సహజమైన యాంటీబయాటిక్, యాంటీవైరల్, యాంటీఫంగల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో జలుబు, దగ్గు, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వంటి వాటిని సమర్థవంతంగా అడ్డుకుంటుంది. అలసిన్ రక్తంలోకి చేరినప్పుడు, బ్లాక్ అయిన రక్తనాళాలను తెరిచి రక్త ప్రవాహాన్ని సులభతరం చేస్తుంది. దీనివల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.. జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అలాగే శరీరంలోని భయంకరమైన ఇన్ఫెక్షన్లను కూడా నాశనం చేస్తుంది. ఫలితంగా, రోగనిరోధక శక్తి బలపడి, శరీరం రోజంతా శక్తివంతంగా, చురుకుగా ఉంటుంది. ఉదయాన్నే నిద్ర లేవగానే, ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను తీసుకొని చిన్న ముక్కలుగా కట్ చేయండి లేదా కచ్చాపచ్చాగా దంచండి. దానిని నోట్లో పెట్టుకుని నములుతూ మింగేయాలి. లేకపోతే వెల్లుల్లి పొట్టు తీసి.. అలానే నమిలి తినాలి. అనంతరం వెంటనే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగాలి. వెల్లుల్లి వాసన లేదా రుచి నచ్చని వారు దంచిన వెల్లుల్లిని గోరువెచ్చని నీటిలో కలుపుకొని తాగవచ్చు. వెల్లుల్లి శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది కాబట్టి.. గోరువెచ్చని నీరు ఆ వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

# ఒంటికి చలువ చేసే పచ్చి ఉల్లి తింటున్నారా?

వేసవి మొదలైంది. వేసవిలో ఆహార అలవాట్లు మార్చుకోవడం తప్పనిసరి. ఈ కాలంలో ఆహారం మార్చుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఉల్లిపాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. ఉల్లిపాయలు శరీరానికి నేరుగా మేలు చేసే అనేక పోషకాలను కలిగి ఉంటాయి. ఉల్లిపాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఉల్లిపాయ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయమవుతాయి. వీటిల్లోని పోషకాల కారణంగా ఉల్లి ఎలా తీసుకున్నా ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. ముఖ్యంగా వేసవిలో మీ ఆహారంలో ఉల్లిపాయలను చేర్చుకోవాలి. వేసవిలో పచ్చి ఉల్లిపాయ తినడం ఎంత తాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవి మొదలైంది. వేసవిలో ఆహార అలవాట్లు మార్చుకోవడం తప్పనిసరి. ఈ కాలంలో ఆహారం మార్చుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఉల్లిపాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. ఉల్లిపాయలు శరీరానికి నేరుగా మేలు చేసే అనేక పోషకాలను కలిగి ఉంటాయి. పచ్చి ఉల్లిపాయల్లో విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. వాటిలో పెద్ద మొత్తంలో కొల్లాజెన్ కూడా ఉంటుంది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. కణాల నిర్మాణం, ఆెం అభివృద్ధిలో ఫోలేట్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే మీ రోజువారీ ఆహారంలో పచ్చి ఉల్లిపాయలను చేర్చుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

# మినప సున్నుండలు.. ఉక్కులాంటి బలం.. ఆరోగ్యానికి ఆరోగ్యం



మినప సున్నుండలు శారీరక బలానికి, సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడే అద్భుతమైన సాంప్రదాయ వంటకం. నల్ల మినుములను, బెల్లం, నెయ్యి ఉపయోగించి తయారుచేసే ఈ సున్నుండలు పిల్లల ఎదుగుదలకు, పెద్దలకు శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రుచికరమైన, ఆరోగ్యకరమైన ఈ సున్నుండలను సులభంగా తయారుచేసుకోవచ్చు..మినప సున్నుండలు.. నల్ల మినుములతో తయారుచేసే బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన సాంప్రదాయ పిండి వంటకం.. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా, శారీరక శక్తిని, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో గొప్పగా సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలకు బలాన్నిచ్చి, పెద్దలలో నడుము నొప్పి, కాళ్ళ నొప్పులు, నీరసం వంటి సమస్యలను తగ్గించడానికి సున్నుండలు చాలా ఉపయోగపడతాయి. మినప లడ్డులో ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన సాంప్రదాయ లడ్డూల్లో.. మినపప్పు, బెల్లం, నెయ్యి ఉండటం వల్ల, ఇవి ఎముకల బలానికి, జీర్ణక్రియకు, చిన్న పిల్లల ఎదుగుదలకు, నడుము నొప్పి తగ్గడానికి చాలా మంచిది. ఇవి యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి.. ఇవి తక్షణ శక్తిని అందివ్వడంతోపాటు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ మినపలడ్డు బాలింతలకు నడుము నొప్పి తగ్గించి, బలాన్ని ఇస్తుంది. పిల్లల ఎదుగుదలకు, జ్ఞాపకశక్తికి మంచిది. అంతేకాకుండా.. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది. అంతేకాకుండా.. కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతుంది. ఎముకల బలానికి సహాయపడుతుంది. బెల్లం సున్నండలు తీసుకోవడం వల్ల రక్త హీనత సమస్య కూడా దూరమవుతుంది.

మినప సున్నుండల తయారీ ఇలా..

సున్నుండలు తయారుచేయడానికి నల్ల మినుములను మాత్రమే ఉపయోగించడం మంచిది. సుమారు ఒకటిన్నర కిలోల నల్ల మినుములను తీసుకుని, వాటిని ఒకేసారి లేదా కొన్ని కొన్ని భాగాలుగా విడదీసి వేయించుకోవాలి. స్టవ్ ను సిమ్ లో లేదా మీడియం ఫ్లేమ్ లో పెట్టి ఐదు నుండి పది నిమిషాల పాటు వేయించుకోవాలి. మినుములు మంచి సువాసన వచ్చి, రంగు మారిన తర్వాత ఒక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఈ విధంగా మిగిలిన మినుములను కూడా వేయించుకోవాలి. ఇలా వేయించడం వల్ల సున్నుండలు రుచికరంగా ఉండటంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. వేయించిన మినుములను మర పట్టి లేదా మిక్సీలో మెత్తటి పొడిగా చేసుకోవాలి. అదే విధంగా, ఒకటిన్నర కిలోల బెల్లంను కూడా తీసుకుని.. పాకం తయారు చేసుకోవాలి. తురిమిన బెల్లం, నెయ్యి కలిపి ఈ లడ్డూలు తయారు చేసుకోవాలి.. పాకం లేదా బెల్లం, మినప పొడిని పొడిని ఒక పెద్ద పాత్రలో వేసి, ఉండలు లేకుండా చేత్తో లేదా గరిటెతో బాగా కలపాలి. ఇది సున్నుండల తయారీలో ముఖ్యమైన దశ, ఎందుకంటే పొడులు సమానంగా కలవకపోతే ఒక దగ్గర తీపి ఎక్కువగా, ఇంకో దగ్గర తక్కువగా ఉండవచ్చు. పొడులు బాగా కలిపిన తర్వాత, కొద్దికొద్దిగా వేడి చేసిన నెయ్యిని కలుపుతూ సున్నుండలను చుట్టుకోవాలి. నెయ్యి వేడిగా ఉంటే ఉండలు చక్కగా వస్తాయి. నెయ్యి కూడా తక్కువ పడుతుంది. మీకు నచ్చిన పరిమాణంలో సున్నుండలను తయారు చేసుకోవచ్చు. కావాలనుకుంటే, సువాసన కోసం యాలకుల పొడిని కూడా కలుపుకోవచ్చు.. అయితే కలపకపోయినా రుచి బాగుంటుంది. ఇలా తయారుచేసిన సున్నుండలను నిల్వ ఉంచుకుని, రోజుకు ఒకటి లేదా రెండు తినడం ద్వారా శారీరక బలాన్ని పొందవచ్చు.

# సమ్మర్‌లో బాడీని కూల్‌గా ఉంచే పండ్లు!



వేసవిలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండాలంటే ప్రకృతి సిద్ధమైన పండ్లను మించిన ఆహారం లేదు. ఇవి మనకు తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, చర్మాన్ని మెరిసేలా చేస్తాయి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వేసవి కాలం వచ్చిందంటే చాలు, భానుడి భగభగలకు శరీరం విలవిలలాడుతుంది. కేవలం చల్లని నీళ్లు తాగడం లేదా ఏసీ గదుల్లో ఉండటం వల్ల మాత్రమే శరీరానికి ఉపశమనం లభించదు. ఎండలు పెరిగే కొద్దీ మన శరీరానికి నీటి అవసరం కూడా పెరుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన కొన్ని రకాల పండ్లు మనల్ని కేవలం చల్లబరచడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. పుచ్చకాయ: వేసవి అంటేనే పుచ్చకాయ! ఇందులో 90 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. దాహాన్ని తీర్చడంతో పాటు విటమిన్ ఎ, సి, లైకోపీన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి, చర్మ రక్షణకు ఎంతో మేలు చేస్తుంది. ముక్కలుగా కోసుకుని లేదా పుదీనాతో కలిపి జ్యూస్‌లా తీసుకుంటే చాలా బాగుంటుంది. కర్బూజా: దీనిని కాంటాలోప్ అని కూడా పిలుస్తారు. ఇందులో నీటి శాతంతో పాటు ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉంటాయి, ఇవి ఎండలో మన శక్తి తగ్గకుండా చూస్తాయి. పొటాషియం, విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ పండును స్మూతీలలో కూడా వాడుకోవచ్చు. మామిడి పండు: పండ్లలో రాజు అయిన మామిడి పండు కేవలం రుచికే కాదు, హైడ్రేషన్ కోసం కూడా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్, విటమిన్ సి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మిల్క్ షేక్స్ కంటే కూడా పండును నేరుగా తినడం వల్ల ఎక్కువ పోషకాలు అందుతాయి. అనాస పండు: పైనాపిల్‌లో నీటి శాతంతో పాటు 'బ్రోమెలైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది మంటను తగ్గించడానికి, జీర్ణక్రియకు సహాయపడుతుంది. మధ్యాహ్నం స్నాక్స్‌లా తీసుకుంటే ఇది చాలా రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. బొప్పాయి: బొప్పాయిలో నీరు, విటమిన్ ఏ, సి, ఈ సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే 'పాపైన్' అనే ఎంజైమ్ వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో దీనిని తీసుకోవడం ఉత్తమం. స్ట్రాబెర్రీలు: వీటిలో నీటి శాతం, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. వీటిని పెరుగు లేదా సలాడ్లలో కలిపి తీసుకోవచ్చు. నారింజ: నారింజ పండ్లు మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, పొటాషియంను అందిస్తాయి. ఇవి శరీరంలోని నీటి నిల్వలను సమతుల్యం చేస్తాయి. రసం తీయడం కంటే తొనల రూపంలో తింటే పీచు పదార్థం కూడా శరీరానికి అందుతుంది. వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవాలంటే కేవలం కృత్రిమ పానీయాల మీద ఆధారపడకుండా, ఇలాంటి ప్రకృతి సిద్ధమైన పండ్లను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోండి. ఇవి మిమ్మల్ని లోపలి నుంచి చల్లబరిచి, ఉత్సాహంగా ఉంచుతాయి.

# 40 ఏళ్లు దాటిన మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



మహిళల ఆరోగ్యం విషయంలో 40 ఏళ్లు అనేది ఒక కీలకమైన మలుపు. ఈ సమయంలో శరీరానికి తగినన్ని పోషకాలు అందకపోతే అది రక్తహీనతకు దారితీస్తుంది. రయన్ ఫెర్నాండో ప్రకారం, ఐరన్, ఫోలేట్, విటమిన్ బి12 అనేవి ఒక జట్టుగా పనిచేస్తాయి. వీటిలో ఏ ఒక్కటి తగ్గినా మిగిలినవి సరిగ్గా పనిచేయవు. వయసు పెరుగుతున్న కొద్దీ మన శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన మహిళల్లో తరచుగా నీరసం, ఎముకల నొప్పులు, అకస్మాత్తుగా లేచి నిలబడినప్పుడు కళ్లు తిరగడం లేదా కళ్ల ముందు నల్లటి చుక్కలు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది వీటిని కేవలం అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ, ఇవి శరీరంలో పోషకాల లోపానికి సంకేతాలు కావచ్చని ప్రముఖ ఒలింపిక్ స్పోర్ట్స్ న్యూట్రిషనిస్ట్ రయన్ ఫెర్నాండో హెచ్చరిస్తున్నారు. అనుష్క శర్మ వంటి తారలకు డైట్ ప్లాన్ రూపొందించిన ఫెర్నాండో, 40 దాటిన మహిళలకు అవసరమైన కీలక పోషకాల గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఐరన్- శరీరంలోని ఎర్ర రక్త కణాలు ఆక్సిజన్‌ను అన్ని భాగాలకు చేరవేయడానికి ఐరన్ చాలా అవసరం. ఐరన్ లోపిస్తే రక్తహీనత ఏర్పడి విపరీతమైన నీరసం, బలహీనత కలుగుతాయి. రోజుకు 18 మి.గ్రా ఐరన్ తీసుకోవాలి. బచ్చలికూర, గుప్పెడు డ్రై ఫ్రూట్స్, ఆర్గాన్ మీట్స్ ద్వారా దీనిని పొందవచ్చు.ఫోలేట్- ఫోలేట్ లేకపోతే శరీరం ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలను తయారు చేయలేదు, ఐరన్‌ను సరిగ్గా గ్రహించలేదు. రోజుకు 400 మి.గ్రా ఫోలేట్ అవసరం. ఒక బీట్‌రూట్, ఒక నారింజ పండు లేదా ఒక కప్పు ఉడికించిన బ్రోకలీని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని అధిగమించవచ్చు. విటమిన్ బి12- మెదడు, నరాల ఆరోగ్యాన్ని కాపాడటంలో, అలాగే డీఎన్‌ఏ తయారీలో బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలో ఫోలేట్ సరిగ్గా ఉపయోగపడటానికి సహాయపడుతుంది. బి12 లోపిస్తే గుండె జబ్బులు, స్ట్రోక్ మరియు ఎముకల బలహీనత వచ్చే ప్రమాదం ఉంది. రోజుకు 2.6 మైక్రో గ్రాములు. పాలు, చేపలు లేదా ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాల ద్వారా బి12 లభిస్తుంది. ఫోలేట్, విటమిన్ బి12 రెండూ ఒకేచోట లభించే అద్భుతమైన ఆహారం గుడ్డు. రోజుకు కేవలం రెండు గుడ్లు తినడం వల్ల ఈ పోషకాల లోపాన్ని సులభంగా భర్తీ చేయవచ్చని న్యూట్రిషనిస్ట్ సూచిస్తున్నారు. వయసుతో పాటు వచ్చే శారీరక మార్పులను గమనిస్తూ, తగిన ఆహారపు అలవాట్లను మార్చుకోవడం చాలా ముఖ్యం.

## చెన్నై సూపర్ కింగ్స్ వైస్ కెప్టెన్ గా

# సంజు శాంసన్!







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో నాయకత్వ బాధ్యతలు మారే అవకాశం ఉందని మాజీ భారత క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజస్థాన్ రాయల్స్ జట్టు నుంచి ట్రేడ్ డీల్‌లో భాగంగా సీఎస్‌కేలోకి సంజు శాంసన్ వచ్చాడు. అతడి రాకతో సీఎస్‌కే జట్టు నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. అతనిని నేరుగా లీడర్‌షిప్ గ్రూప్‌లో చేర్చే అవకాశం ఉందని కుంబ్లే పేర్కొన్నారు. జియో హాట్‌స్టార్‌లో ప్రసారమైన "గేమ్ ప్లాన్ -- నో యువర్ టీమ్" కార్యక్రమంలో కుంబ్లే మాట్లాడుతూ.. సంజుకు వైస్ కెప్టెన్ బాధ్యతలు ఇవ్వడం సరైన నిర్ణయం అన్నారు. ఆ పాత్రకి సరైన న్యాయం చేస్తాడని చెప్పారు. రాజస్థాన్ జట్టుకు అతను చాలా కాలం కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందుకే నాయకత్వ బాధ్యతలు అతనికి కొత్తేమి కాదని అనిల్ కుంబ్లే అన్నారు.సంజు శాంసన్ ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఎన్నో సీజన్ల పాటు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు డిప్యూటీగా, అలాగే ఎంఎస్ ధోనీ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తుందని అనిల్ కుంబ్లే వెల్లడించారు. గత ఐపీఎల్ 2025 సీజన్‌లో గైక్వాడ్ గాయం కారణంగా ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. దీంతో జట్టు నాయకత్వ బాధ్యతలు మళ్లీ ధోనీకి అప్పగించాల్సి వచ్చింది. ఆ సీజన్‌లో సీఎస్‌కే చరిత్రలో తొలిసారి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. కానీ ఈసారి ఐపీఎల్ 2026లో బలంగా పునరాగమనం చేయాలని సీఎస్‌కే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరో టైటిల్ గెలవాలనే ఆశయంతో జట్టు సన్నద్ధమవుతోందన్నారు.

**సీఎస్కే స్క్వాడ్ 2026:**

**బ్యాటర్లు:** రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), దేవాల్డ్ బ్రేవిస్, అయుష్ మత్రే, కార్తిక్ శర్మ, సర్ఫరాజ్ ఖాన్, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్)

**ఆల్‌రౌండర్లు:** అన్షుల్ కాంబోజ్, జేమీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, ప్రశాంత్ వీర్, మ్యాథ్యూ షార్ట్, అమన్ ఖాన్, జాక్ ఫౌల్క్స్, శివం దూబే

**బౌలర్లు:** ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, ముఖేష్ చౌదరి, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, గుర్జప్నీత్ సింగ్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, రాహుల్ చాహర్

## సంజుతో ఎవరిని పోల్చలేం.. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28న ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అన్ని జట్లు సిద్ధమవుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ సైతం తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఈసారి ట్రోఫీనే టార్గెట్ గా బరిలోకి దిగుతుంది ఈ టీమ్. రాజస్థాన్ కి చాలా కాలం పాటు ఆడిన సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ కు ట్రేడింగ్ కావడంతో పాటు సీఎస్కే నుంచి సామ్ కరాన్, రవీంద్ర జడేజాలు వచ్చారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మీడియాతో మాట్లాడుతూ.. "సంజు శాంసన్ ఆట ప్రత్యేకం, అతడితో ఎవరితో పోల్చలేమన్నారు. ప్రతి ఆటగాడు గెలిచేందుకు ఆడతాడని పేర్కొన్నారు. ఇక గత సీజన్లో చివరి దశలో మేము కొంచెం స్వేచ్ఛగా ఆడి ఉంటే, కచ్చితంగా టోర్నీలో మరింత ముందుకు వెళ్లే వాళ్లం.. ఈసారి ఆ తప్పులను సరిదిద్దుకుంటున్నామని పరాగ్ వెల్లడించారు. టీమ్ లో స్పిన్, ఫాస్ట్ బౌలర్ల సమతుల్యత ఉంది.. బ్యాటింగ్‌లో రైట్-హ్యాండ్, లెఫ్ట్-హ్యాండ్ బ్యాట్స్‌ల సమతుల్యత ఉండటంతో ఈసారి మా దగ్గర స్ట్రాంగ్ బ్యాటింగ్ లైన్ ఉందని రియాన్ పరాగ్ చెప్పారు. రవీంద్ర జడేజాపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది.. హోమ్ గ్రౌండ్‌లో ఆడడంపై ఎక్కువ ప్రభావం ఉండదన్నారు. స్టేడియం ఏదైనా ఈసారి దుమ్మురేపి మాత్రం రాజస్థాన్ రాయల్స్ జట్టే అని ధీమా వ్యక్తం చేశారు. కొంతమంది అభిమానులు చీర్ చేస్తారు, మరీ కొందరు ప్రత్యర్థులను గేలి చేస్తారు.. కానీ మేము డిస్ట్రాక్షన్స్ నుంచి దూరంగా, మా ఆటపై దృష్టి పెడతామని తెలిపారు. మా లక్ష్యం ఒక్కటే ఈ టోర్నీలో బలమైన ప్రదర్శన ఇవ్వడమేనని పరాగ్ పేర్కొన్నారు. జడేజా అద్భుతమైన ఆల్‌రౌండర్, ఆయనపై జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుందని రియాన్ పరాగ్ అన్నారు. మ్యాచ్ పరిస్థితుల ప్రకారం, కష్ట సమయాల్లో వీటిని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామన్నారు. వైభవ్ సూర్యవంశీపై హెడ్ కోచ్ కుమార్ సంగక్కారా విశ్వాసం పెట్టుకున్నారు.. అతను యంగ్ క్రికెటర్ జస్ట్ 15, -16 ఏళ్ళలోనూ అద్భుతమైన ఫామ్ కనబరుస్తున్నాడు.. అతని కోసం ప్రత్యేక వ్యూహం రూపొందించామని చెప్పారు. ఇప్పటికే జట్టు ప్రిపరేషన్లు పూర్తి చేసింది.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతి అంశంపై దృష్టి పెట్టాం.. ప్రతీ రోజు బాగా ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నామని రియాన్ చెప్పారు.

**IPLలో రాజస్థాన్ రాయల్స్ స్క్వాడ్:**

రవీంద్ర జడేజా, సామ్ కరాన్, డొనోవన్ ఫెరేరా, సందీప్ శర్మ, శుభం డుబే, వైభవ్ సూర్యవంశీ, లుహాంద్రే ప్రిటోరియస్, షిమ్రాన్ హెట్మియర్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, యుధ్వీర్ సింగ్ చారక్, జోఫ్రాండ్ మాతృమూర్తి, జోఫ్రాండ్ ఆర్వాండ్, తుషార్నా రవి బిష్ణోయి, సుశాంత్ మిశ్రా, యష్ రాజ్ పుంజా, విఘ్నేష్ పుతూర్, రవి సింగ్, అమన్ రావ్, బ్రిజేష్ శర్మ, ఆడమ్ మిల్న్, కుల్దీప్ సేన్.

## అయ్యో కేకేఆర్‌కు వరుస ఎదురుదెబ్బలు.. రూ. 18 కోట్లు పెట్టిన ఫలితం శూన్యం!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకి వరుస షాక్స్ తగిలాయి. భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలతో ఢాకా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ని కేకేఆర్ జట్టు నుంచి తప్పించింది. ఇక టీమిండియా స్టార్ పేసర్ హర్షిత్ రాణా గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే ఛాన్స్ కనిపిస్తుంది. పేస్ దళాన్ని పటిష్టం చేసే క్రమంలో శ్రీలంక బౌలర్ మతీశ పతిరణని తుది జట్టులోకి తీసుకుంటే ఇప్పుడు ఆడటంపై కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.వరల్డ్ కప్ టోర్నమెంట్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో గాయపడిన పతిరణ.. టోర్నీకి దూరమయ్యాడు. దీంతో ఇటీవలే అతడు ఫిట్నెస్ సాధించినట్లు తెలుస్తుంది. కానీ శ్రీలంక క్రికెట్ బోర్డు మాత్రం ఐపీఎల్లో ఆడేందుకు మతీశకు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) ఇచ్చేందుకు జాప్యం చేస్తున్నట్లు సమాచారం. పతిరణ ఫిట్నెస్ పై తమకు సంతృప్తికరమైన సమాచారం వచ్చినపుడే చీజ ఇవ్వాలని చూస్తున్నట్లు లంక బోర్డు భావిస్తుంది. ఈ విషయంపై కేకేఆర్ ాాజ బోర్డుతో పతిరణ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడనే అంశంపై చర్చిస్తుంది. శ్రీలంక క్రికెట్ బోర్డుతో సంప్రదింపులు చేస్తున్నాం.. ప్రతి రోజు పతిరణ కోసం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేయడం, రద్దు చేయడం జరుగుతోందని కేకేఆర్ యాజమాన్యం పేర్కొనింది. కాగా చెన్నై సూపర్ కింగ్స్ తరపున 2022లో ఐపీఎల్లోకి వచ్చిన అతడు.. మహేంద్ర సింగ్ ధోని ప్రియ శిష్యుడిగా కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 32 ఐపీఎల్ మ్యాచ్లు ఆడిన మతీశ పతిరణ.. 47 వికెట్లు పడగొట్టాడు. 2026 వేలానికి ముందు చెన్నై అతడిని విడిచి పెట్టగా.. కేకేఆర్ రూ. 18 కోట్లకు దక్కించుకుంది. ఓవైపు హర్షిత్ రాణా జట్టుకు దూరమవడం.. పతిరణ విషయంలోనూ సస్పెన్స్ కేకేఆర్ కి పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు, పతిరణ మేనేజర్ మాత్రం త్వరలోనే అతడు అందుబాటులోకి వస్తాడనేలా సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.



**శృతి హాసన్ యొక్క భీకరమైన బ్రౌన్ గౌన్ గ్లో: బ్యాక్ ఇన్ యాక్షన్**

# మొత్తానికి సమంతకు ఆ ఛాన్స్ సమీపిస్తోందా?



దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసిన సమంత బాలీవుడ్ వెండితెర ఎంట్రీ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్ సిరీస్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సత్తా చాటినా? అది బుల్లి తెర కావడంతో? అమ్మడు సంతృప్తి చెందలేదు . ఒక భారీ హిందీ సినిమా ద్వారా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించాలనే ప్రయత్నాలు చేస్తున్నా? సరైన ఛాన్సులు రాకపోవడంతో నీరిక్షణ తప్పలేదు. తాజాగా సామ్ వెండి తెర ఎంట్రీకి సమయం ఆసన్నమైంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందున్న కొత్త సినిమాలో సమంతను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, మిస్టర్ అండ్ మిసెస్ మాహి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శరణ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్‌కు సమంతతో ఉన్న స్నేహం కారణంగా ఈ ఛాన్స్ దక్కుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఛాన్స్ ఫైనల్ కానుందని సమాచారం. అదే నిజమైతే సమంత ఆనందానికి అవధులుండవ్. సమంత హిందీ సినిమాల్లో నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తోంది. మధ్యలో అనారోగ్య సమస్యలు , వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు విరామం తీసుకున్నప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు.ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకోవడం అమ్మడికి కెరీర్ పరంగానూ కొంత కలిసొచ్చిందని చెప్పొచ్చు. భర్త వైపు నుంచి కూడా కొత్త అవకాశాలు రావడానికి ఛాన్స్ ఉంది. ఇప్పటికే ముంబైలో ఖరీదైన ఇంటిని కూడా కొనుగోలు చేసిన సమంత మకాంను పూర్తిగా బాలీవుడ్‌కు మార్చే సింది. సిద్ధార్థ్ మల్హోత్రా వంటి హ్యాండ్సమ్ హీరో సరసన ఆమె జోడీ కడితే బాలీవుడ్‌లో ఒక ఫ్రెష్ అండ్ క్రేజీ కాంబినేషన్ అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు.శరణ్ శర్మ చిత్రాలు భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఉంటాయి. దీంతో సమంత లాంచింగ్ ఇదే పర్ఫెక్ట్ స్టోరీ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే హిందీ భాషపై అమ్మడు పట్టు సాధించింది. అక్కడి ప్రేక్షకు లకు నటనతో మరింత దగ్గరవ్వాలని ఆశపడుతోంది. ధర్మ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్ లో లాంచ్ అయితే? వచ్చే గుర్తింపు కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. హబ్బీ రాజ్ నిడిమోరు సహకారం కూడా అన్ని రకాలుగా దక్కుతుంది. ఇకపై భర్త దర్శకత్వంలో కూడా సినిమాలు చేయడానికి ఛాన్స్ ఉంటుంది. బాలీవుడ్ లో రాజ్ కున్న పరిచయాలతో మరిన్ని అవకాశాలకు ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి సమంత బాలీవుడ్ ఎంట్రీ ఆలస్యమైనా? స్ట్రాంగ్ గానే కనిపిస్తుందని చెప్పొచ్చు.



**మీనాక్షి చౌదరి బ్లాక్ టాప్ మరియు డెనిమ్ లుక్‌లో హల్ చల్ చేస్తుంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965